ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : **సద్గురు శ్రీ నాన్నగారు**

సంపుటి : 11 | సంచిక : 2 | అక్టోబరు 2005



**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

**పేజీలు : 36**

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. **సత్యవతి (హైమ)**

**చందా**

సంవత్సర చందా:రూ॥100/-

విడి ప్రతి : రూ॥ 8/-

చిరునామా

**రమణ భాస్కర**

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


**ఈ సంచికలో....**


భీమవరం .................... 26-08-05

అరుణాచలం ................ 11-09-05

యానాం ...................... 04-09-05



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్ (దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్, పాలకొల్లు, ☎ 08814 - 228858


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-08-05, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈరోజు జన్మాష్టమి, శ్రీకృష్ణుడి జన్మదినము, ఆయన పూర్ణ పురుషుడు. ఆయన సాధన చేసి దేవుడు అవ్వలేదు, ఆయన సహజంగా దేవుడు. శ్రావణ బహుళ అష్టమిరోజున భగవంతుడు అన్ని కళలతోటి, అన్ని శక్తులతోటి మధురపట్టణంలో ఒక కారాగారంలో జన్మించిన వాడివలె కనిపించాడు. భగవంతుడు జన్మరహితుడు, మరణరహితుడు, ఆకారరహితుడు, గుణరహితుడు, వికారరహితుడు. అన్ని వికారములు ఉన్నవాడు జీవుడు, ఏ వికారము లేనివాడు దేవుడు. సాధారణంగా పిల్లలు పుట్టిన తరువాత పెద్దవారు వారికి మాటలు నేర్పుతారు. పుట్టగానే మాట్లాడిన దేవుడు ఎవరైనా ఉన్నారా అంటే వాడు కృష్ణుడు. నేను ఇక్కడ ఉన్నాను, ఈ శరీరాన్ని తీసుకొని వెళ్లి రేపల్లెలో యశోద ఇంటిలో పెట్టండి అని వసుదేవుడితో చెపుతాడు. మరి యమునా నది వరదలో ఉంది అక్కడకు నిన్ను తీసుకొని వెళ్లటం ఎలాగ? అని వసుదేవుడు అడిగితే నది దారి ఇస్తుంది అని చెప్పాడు. పుట్టగానే ఈ మాటలు అన్నీ చెప్పాడు, వాడు దేవుడు. రాముడి అవతారంలో మనం ఎలా జీవించాలో ఆయన ఆచరించి మనకు చూపించాడు. రాముడు మహావిష్ణువే, కృష్ణుడు మహావిష్ణువే. కాని ఆయన శరీరపాత్ర వేరు, ఈయన శరీరపాత్ర వేరు. ఒకో ఉపాధి ద్వారా ఒకో పని జరుగుతుంది. జ్ఞానికి, అజ్ఞానికి పెద్ద తేడా ఏమీ లేదు. అన్నింటికీ తానే కర్తను అని అజ్ఞాని అనుకొంటాడు, దేనికీ నేను కర్తను కాదు అని జ్ఞాని అనుకొంటాడు. అందుచేత జ్ఞాని సుఖంలో ఉంటాడు. అన్నింటికి తానే కర్తను అనుకోవటం వలన అజ్ఞాని వేదనలో, దుఃఖ సముద్రములో ఈదులాడుతూ ఉంటాడు. కృష్ణుడు అంటే ఒక ప్రేమ ప్రవాహం, భక్తి ప్రవాహం, జ్ఞాన ప్రవాహం. ఆయన అందరిలోను

అంతర్యామిగా ఉన్నాడు, అందరికి అతీతంగా ఉన్నాడు. యుద్ధానికి రమ్మని అర్జునుడిని కృష్ణుడు పిలువలేదు, యుద్ధానికి రమ్మని అర్జునుడే కృష్ణుడిని పిలిచాడు. అర్జునుడు యుద్ధం చేయటానికి వచ్చి శంఖం ఊదాడు, ఎదురుగా ఉన్న వారిని చూసి సడన్‌గా ఆయనకు మమకారం వచ్చింది, మోహం వచ్చింది. మనలో మమకారం ఉన్నంతకాలం కోటి జన్మలు ఎత్తినా కర్మ మనలను విడిచిపెట్టదు. మమకారరహితుడిని, అహంకారరహితుడిని కర్మ వాసనలు విడిచిపెడతాయి కాని అహంకారంతో కూడిన వాడిని, మమకారంతో కూడిన వాడిని కర్మ వాసనలు విడిచిపెట్టవు. మమకారం వలన వీడు యుద్ధం చేయనంటున్నాడు అని కృష్ణుడు గ్రహించాడు. అర్జునుడిలో ఉన్న మమకారం పోగొట్టటానికి, మోహం పోగొట్టటానికి భగవంతుడు భగవద్గీత బోధించాడు.

కృష్ణుడికి పార్థసారధి అని పేరు అంటే అర్జునుడికి రథసారధి. మనకు నిజమైన భక్తి కనుక ఉంటే మన జీవితరథాన్ని కూడా ఆయన తోలతాడు. ఆయన అర్జునుడికి దగ్గరవాడు, మనకు దూరంవాడు కాదు, ఏ పక్షపాతం లేనివాడు పరమాత్మ. పక్షపాతం ఉన్నవాడు జీవుడు. ఆయన మన బండిని తోలడేమో అని మన అజ్ఞానం వలన అలా అనుకొంటున్నాము, మనకు ఆయన పట్ల పరిపూర్ణమైన విశ్వాసం కనుక ఉంటే మన బండిని కూడా ఆయన తోలతాడు, వాడే సర్వేశ్వరుడు, వాడే సర్వజ్ఞుడు, జగత్తును నియమించేవాడు, జీవకోటికి కర్మఫలాన్ని కేటాయించేవాడు ఆయనే. భక్తతుకారాం పాండురంగ భక్తుడు. రంగడు అన్నా, కృష్ణుడు అన్నా ఒక్కటే. ఓ పాండురంగ విఠలా, ఓ కృష్ణా, ఓ అచ్యుతా, ఓ గోవిందా ఈ లోకంలో ఎంతో ఐశ్వర్యాన్ని చూసాను, అధికారం చూసాను, సంపదలు చూసాను, ఆయా రంగాలలో పెద్దవారయిన వారిని చూసాను, ఈ లోకంలో ఉన్న రకరకాల మనుషులను చూసాను. ఈ లోకంలో నీ పేరులో తప్పించి ఎక్కడా నాకు రుచి కనిపించలేదు అన్నాడు తుకారామ్. ఏసుక్రీస్తు శరీరం, బుద్ధుడి శరీరం, రామకృష్ణ పరమహంస శరీరం వీరందరి శరీరాలు శవాలు అయినవి కాని, శరీరంతోటి వైకుంఠానికి వెళ్ళినవాడు తుకారామ్, ఆయన శరీరం శవం అవ్వలేదు. మన రీజన్‌కు అందటం లేదు ఏమిటి అని హేతువాదులందరు కొట్టుకొని చచ్చారు. శరీరంతో సహా భగవంతుడిలో ఐక్యమయినవాడు తుకారామ్. మీరు పురాణాలు కాదనవచ్చు కాని ఇది 400 సం॥లకు క్రితం జరిగింది.

భీష్ముడు మహాభక్తుడు, ఆయనకు స్వచ్ఛంద మరణం ఉంది, ఆయనను ఎవరూ చంపలేరు. భారతయుద్ధంలో ఆయన పదిరోజులు యుద్ధం చేసిన తరువాత యుద్ధం ఆపు చేసేసాడు, ఉత్తరాయణం వచ్చేదాక అంపశయ్యమీద ప్రాణం కాపాడుకొన్నాడు, ఉత్తరాయణం వచ్చాక ప్రాణం విడిచిపెట్టాడు. భీష్ముడు యుద్ధం మానివేసిన రోజున రాత్రి దుర్యోధనుడు కర్ణుడి దగ్గరకు వెళ్ళి తాతగారు వెళ్ళిపోయారు, ఆయన ఏ సుఖం అనుభవించలేదు, మన కోసం త్యాగాలు చేసాడు అని బాధపడతాడు. ఆయన పెద్దవాడు, మహాభక్తుడు. ఆయనను

చూసి వద్దామని అప్పుడు కర్ణుడికి అనిపించింది. భీష్ముడు అంపశయ్యమీద పడుకొన్నాడు, కర్ణుడు అక్కడకు వెళ్ళాడు. అప్పుడు కర్ణుడు భీష్ముడితో "ఓ పితామహా! నీకు నేను అంటే ఇష్టం ఉండదు, నన్ను చూడటం కూడా నీకు ఇష్టం ఉండదు. అందుచేతనే నువ్వు యుద్ధం చేస్తున్నంతకాలం నేను యుద్ధం చేయను అని చెప్పాను. నేను అంటే నీకు ఇష్టంలేకపోయినా మరల కనిపించవని చూడటానికి వచ్చాను" అని చెపుతాడు. "కర్ణా! నీవు పొరపాటుగా అర్థం చేసుకొంటున్నావు, నువ్వు అంటే నాకు ఇష్టం లేకపోవటం ఏమిటి? అర్జునుడి కంటే నీవు గొప్ప వీరుడివి కాని నీకు గర్వం ఎక్కువ, ఇతరులను అవమానపరిచే గుణం నీలో ఉంది, పాండవులను అనేకసార్లు అవమానించావు. నీ గర్వం అణచటానికి, నీవు బాగుపడటానికి సభలలో అలా మాట్లాడాను గాని, నీమీద ఇష్టం లేకకాదు కర్ణా!" అన్నాడు భీష్ముడు. "సరే! నాపని అయిపోయింది, రేపటి నుండి నీవు యుద్ధం చెయ్యి, పాండవులను జయించి ఈ మూటనంతా దుర్యోధనుడికి ఇస్తేవాడు మింగుదామని చూస్తున్నాడు, నువ్వు యుద్ధం చేసి నీ పని ఏదో నీవు పూర్తి చెయ్యి" అని చెపుతాడు. అప్పుడు కర్ణుడు తన హృదయాన్ని ఓపెన్ చేస్తాడు, "భీష్మా! నన్ను ఎందుకు మాయలో పెడతావు? ఆ నల్లటివాడు, అర్జునుడి రథంతోలేవాడు ఎవడో తెలియనంత అమాయకుడినా? అన్నాడు కర్ణుడు. రేపటి నుండి యుద్ధం చెయ్యి, పాండవులను జయించి రాజ్యాన్ని అప్పగించు అంటున్నావు - మన తలరాతలు వ్రాసేవాడు, ఆ ప్రకారం నడిపించేవాడు, ఆ నల్లటివాడిని ఎవరు జయిస్తారు? ఎందుకు ఈ మాయమాటలు చెపుతున్నావు? అంటాడు కర్ణుడు. కౌరవసైన్యంలో పెద్దపెద్ద వీరులు, మహావీరులు ఎంతోమంది ఉన్నా కృష్ణుడు రథసారథ్యం చేస్తూ వారినందరిని తప్పించుకొని, ఆ సుడిగుండాలలో పడకుండా పాండవులను రక్షించి, యుద్ధంలో నెగ్గించగల శక్తి ఆ నల్లటివాడికి ఉందని నాకు తెలియదా? నీకు తెలియదా? ఈ మాయమాటలు ఎందుకు భీష్మా?" అంటున్నాడు. పాండవులను ఎలా ఒడ్డుకు తీసుకొని వచ్చాడో అలాగ మనం సాధన చేసేటప్పుడు ఎన్ని అవరోధాలు వచ్చినా వాటి నుండి మనలను తప్పించి, మనలను ఒడ్డుకు తీసుకొని వచ్చే వాడే మన గురువు, వాడే పరమాత్మ.

భక్తుల జీవితాలలో మీకు ఎన్నో కష్టాలు కనబడతాయి. మీరాభాయి ఎన్నో కష్టాలు పడింది, కబీరుకూడా ఎన్నో కష్టాలు పడ్డాడు. ఆ కష్టాలన్నింటిని ప్రక్కకు పెట్టి, అటు చూడకుండా, లక్ష్యాన్ని విడిచిపెట్టకుండా, మోక్షాన్నే గమ్యంగా పెట్టుకొని తదనుగుణంగా భక్తుడు మాట్లాడుతూ ఉంటాడు కాని దానికి భిన్నంగా అసలు ఏమీ మాట్లాడడు. మనం గమ్యాన్ని మర్చిపోతే మన జీవితానికి అర్థంలేదు. భక్తుడు ఎప్పుడూ అర్థంపర్థంలేని మాటలు మాట్లాడకూడదు, తను ఏదైతే గమ్యంగా పెట్టుకున్నాడో దాని గురించే మాట్లాడాలి. ఇది కబీరు, మీరాభాయి జీవితాలలో కన్పిస్తుంది. కృష్ణుడు అవతరించి యుద్ధాలు చేయటమే కాదు, యుగాలు మారినా కలకాలం మనకు ఉపయోగపడేలా, ఈ ప్రకృతి మధ్యలో ఉండి ప్రకృతి గుణాల నుండి విడుదల పొంది

శాశ్వత పదవిని, మోక్షాన్ని ఎలాపొందాలి అనేది, ఒక మెట్టు తరువాత ఒక మెట్టు ఎక్కి మేడపైకి ఎలా వెళతామో అలాగ అనేకమెట్లు చూపించి, అనేక కోణాలు చూపించి, మనం తరించటానికి ఎన్నో ఉపాయాలు భగవంతుడు చెప్పాడు, అదే భగవద్గీత, అదే గోవిందుడు చెప్పిన ఉవాచ. ఈమధ్య హైవేలో 4 లైన్స్ రోడ్డు వేసారు, మనం బ్రేకు మీద కాలు వేయకుండా చాలా స్పీడుగా వెళ్ళిపోవచ్చును. భగవద్గీత మనకు ప్రోపర్‌గా అర్ధమయితే అలా చాలా స్పీడుగా వెళ్ళి ధర్మాన్ని ఆచరించి, మోక్షాన్ని పొందవచ్చును. అటువంటి మార్గాలు గీతలో భగవంతుడు చూపించాడు. మనకు ధర్మం మీద గౌరవంలేదు, తోటి మానవుడి మీద గౌరవం లేదు, సామాజిక స్పృహ లేదు. గుడికి వెళితే మనం బాగు పడాలని, పైకి వెళ్ళిపోవాలని ప్రార్థించటమేగాని మీరు ఎప్పుడైనా మీ జీవితంలో ఇతరులకోసం దేవుడిని ప్రార్థించారా? ఇంటి దగ్గర కూర్చొని ఏదో అరగంట ప్రాణాయామం చేసి, అరగంట ధ్యానం చేసి సందుల ద్వారా మోక్షానికి వెళ్ళిపోతావా? మీలో మీరు పరిశోధన చేసుకోండి. మీరు పూజ చేసినా, వ్రతం చేసినా మీ గురించి మీరు చేసుకొంటు న్నారు కాని ఇతరుల కోసం ఎప్పుడైనా మీరు చేసారా? నువ్వు గొప్పస్థితికి వెళ్ళిపోవాలను కొంటున్నావు లేకపోతే రాబోయే జన్మ గొప్పజన్మ రావాలనుకొంటున్నావు లేకపోతే చనిపోయిన తరువాత గొప్ప గొప్ప లోకాలకు వెళ్ళిపోవాలనుకొంటున్నావు. ఈ పూజచేస్తే ఇది వస్తుంది, ఆ పూజచేస్తే అది వస్తుంది ఇలా వెళ్ళిపోవాలనుకొంటున్నారు కదా. ఇలా గొప్ప జన్మ రావాలని, వైకుంఠానికి వెళ్ళిపోవాలని, అందరూ నా వంక చూడాలని నీలో ఎవడైతే విర్రవీగుతున్నాడో వాడిని వదిలించుకోకపోతే నీకు గతిలేదు అంటున్నారు భగవాన్. ఇలా అనుకునేవాడు ఎవడు? వాడిని అర్థంచేసుకొని, వాడిలోనుండి విడుదల పొందకపోతే నువ్వు కోటి జన్మలు ఎత్తినా నీకు ముక్తిలేదు, నీకు సహజస్థితి రాదు.

జ్ఞానం మనిషిని పరమపవిత్రుడిని చేస్తుంది. జ్ఞానంతో సమానమైనది ఈ ప్రపంచంలో ఏదీ లేదు. మన అవసరాలకోసం దేవుడిని ప్రార్థిస్తున్నాము కాని ఓ కృష్ణా! నారాయణా! నాకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించు, నా గమ్యం అదే అని ప్రార్థించేవారు మనలో ఎంతమంది ఉన్నారు. ఈ సృష్టిలో ఆత్మజ్ఞానం లేనివారికి ఇంతవరకు మోక్షం రాలేదు, నిర్వాణసుఖం అందలేదు. నీకు కోరిక, ద్వేషం లేకపోతే ఈ బంధంలో నుండి ఏమీ నొప్పి లేకుండానే విడుదల పొందుతావు అర్జునా! అంటే బాధపడి గమ్యాన్ని చేరటం కాదు. మనం భీమవరంలో ట్రైనులో జాయిన్ అయ్యాము అనుకోండి, మనకు గాఢనిద్ర వచ్చేసింది అనుకోండి, మనం నిద్రలో ఉంటాము. ఈలోపుగా సికింద్రాబాద్ వచ్చేస్తుంది. అప్పుడే సికింద్రాబాద్ స్టేషన్ వచ్చేసిందా అనుకొంటాము. నీకు కోరిక, ద్వేషం, ఫలకాంక్ష లేకపోతే అంత సుఖంగా, అంత తేలికగా, సేఫ్‌గా మోక్షాన్ని పొందుతావు.

మనకు కర్మవాసనలు ఎలా వస్తాయి అంటే ఎక్కడో ఇష్టం పెట్టుకొంటాము, ఎక్కడో

అయిష్టం పెట్టుకొంటాము. అయిష్టం పెట్టుకొన్న చోట ఎలా బయట పడాలో చూస్తాము, ఇష్టం పెట్టుకొన్నచోట ఆ కోరిక ఎలా నెరవేర్చుకోవాలి అని చూస్తాము. వీటి వలన కర్మవాసనలు పెరుగుతాయి, ఆ వాసనలే నిన్ను బంధిస్తాయి. "24 గంటలు కష్టపడి ధ్యానం చేసి ఏదైతే పొందుదామనుకొంటున్నారో, కర్మఫలకాంక్ష లేకుండా పనిచేసేవాడు కూడా అదే పొందుతాడు" అని గీతలో పరమాత్మ చెప్పాడు. "వాడు పొందేది వేరు, వీడు పొందేది వేరు అని ఎవరైనా చెపితే పిల్లకాయల మాటల కింద వదిలెయ్యి" అని చెప్పాడు. మీరు ఒకటి మర్చిపోకూడదు. మీరు జపం చేసినా, ధ్యానం చేసినా, పూజ చేసినా, యాత్రలు చేసినా, ఇంటి దగ్గర వ్రతాలు చేసినా ఎన్ని చేసినా ఇవి అన్నీ కూడా మన మనస్సును పవిత్రం చేయటానికి, మన బుద్ధిని శుద్ధి చేసుకోవటానికి చేస్తున్నాము అని మర్చిపోవద్దు. మన బుద్ధి శుద్ధి అయితే అప్పుడు అది గమ్యం మీద నిలబడుతుంది. మన బుద్ధి శుద్ధి అవ్వకపోతే గంటకు ఒక రకంగా ఉంటాము. బుద్ధికి స్థిరత్వం లేదు, మనస్సు నిండా కోరికలు వీరికా మోక్షం అంటున్నాడు పరమాత్మ. ఎవరైనా ఏదైనా ఇస్తే నేను తీసుకొంటానయ్యా, ఆకు ఇస్తే ఆకు తీసుకొంటాను, నీళ్ళు ఇస్తే నీళ్ళు తాగుతాను, పండు ఇస్తే పండు పుచ్చుకొంటాను, ఎప్పుడు? నువ్వు ప్రేమతో, భక్తితో ఇస్తే తీసుకొంటాను అంటున్నాడు. దేవుడు అంటే ప్రేమ, దేవుడు అంటే శాంతి, దేవుడు అంటే ఉండటం. దేవుడు అంతటా ఉన్నాడు, ఆయన నీ హృదయంలో ఉన్నాడు. నీకు దేహమే నేను అనే తలంపు ఉంది కాబట్టి ఈ దేహం నిజం, ఈ లోకం నిజం, దేవుడు ఎక్కడో ఉన్నాడు అనుకొంటున్నావు. అంతర్యామిగా ఉన్న దేవుడిని తెలుసుకోలేక పోతున్నావు. ఈ దేహాత్మబుద్ధిలో నుండి విడుదల పొందితేగాని నిర్వాణసుఖం పొందలేవు.

ఈశ్వరుడు అన్నా, గురువు అన్నా, ఆత్మ అన్నా ఒక్కటి అంటే ఒక్కటే. నువ్వు భగవంతుడిని ప్రార్థించగా ప్రార్థించగా, జపించగా జపించగా, ధ్యానించగా ధ్యానించగా, నీ మనస్సుతోటి, ఇంద్రియాలతోటి నీ బుద్ధితోటి భగవంతుడు సంతోషించే పనులు చేస్తూ ఉంటే, భగవంతుడి అనుగ్రహం కోసమే నీవు పనిచేస్తూ ఉంటే ఆయనే నీకు గురువుగా వచ్చి నిన్ను తరింపచేస్తాడు, ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. భగవంతుడు నీకు ఎన్ని అవకాశములు ఇచ్చాడో అన్ని అవకాశములతోటి ఆయనను ప్రార్థిస్తూ ఉంటే, నీకు చెవులు ఉన్నాయి భగవంతుడిని పొందటంకోసం వినండి, కళ్ళు ఉన్నాయి భగవంతుడి రూపాన్ని చూడండి, నోరు ఉంది భగవంతుడి గురించి మాట్లాడండి, కాళ్ళు ఉన్నాయి గుడి చుట్టూ తిరగండి, చేతులతోటి ఆయనను పూజించండి, ఇలా మీ అవయవాలు అన్నీ ఉపయోగించుకొని భగవదనుగ్రహం పొందటానికి ప్రయత్నం చేయండి. అప్పుడు అంతటా ఉన్న ఆ నల్లటివాడు పరమాత్మ మీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మధురాధిపతి వదనం మధురం, గమనం మధురం, మధురాధిపతికి అంతా మధురమే, యుద్ధం కూడా ఆయనకు మధురమే. అనంత తత్వానికి

ఆకాశం కూడా గుర్తే, సముద్రం కూడా గుర్తే అన్నారు రాజగోపాలాచారి. లోతుకు సముద్రంలాంటి వాడు, విశాలానికి ఆకాశంలాంటివాడు, వాడే నల్లనయ్య అంటాడు రాజాజీ. ఇప్పుడు మీకు సాధన బాగా జరగటం లేదు అంటే మీరు పూర్వజన్మలో సాధన ఏమీ చెయ్యలేదని అర్థం. మీరు పూర్వజన్మలో బాగా సాధన చేస్తే, పూర్వజన్మ పుణ్యబలం మీకు ఉంటే ఆ వాసనే, ఆ సంస్కారమే, ఆ పుణ్యబలమే నీచేత ఇప్పుడు సాధన చేయిస్తుంది. కొంతమంది ఎలా ఉంటారు అంటే మేము వండుకొన్నది అంతా మేమే తినేస్తాము, మేము సంపాదించుకొన్నది అంతా మేమే తినేస్తాము, మేము ఎవరికి ఒక్క మెతుకు కూడా పెట్టము అంటారు, అటువంటివారు ఎవరైనా ఉంటే వారు తినేది అన్నముకాదు, పాపము తింటున్నారు అంటున్నాడు పరమాత్మ. వారు బతికి ఉండగా పాపం పోగేసుకొంటారు, మరణానంతరము వారికి చీకటిలోకాలు మిగులుతాయి. మీ జీవితంలో గౌరవాలు ఆశించకుండా, గొప్పలు ఆశించకుండా కనీసం ఒక్క మనిషినైనా ప్రేమించావా? చాలామంది మంచిపనిచేసేవారు కూడా గౌరవాలు ఆశించి ఆ పనులు చేస్తారు. దాని వలన ప్రపంచంలో గొప్ప రావచ్చు కాని ఈశ్వరుని దయ నీకురాదు.

మనకు దేహాభిమానంలో నుండే ద్వైతబుద్ధి వస్తుంది. అబేధంగా ఉన్న పరమాత్మలో కూడా మనం భేదం చూస్తాము. జ్ఞాని ఈ భేదాల మధ్యన అభేదాన్ని చూస్తాడు, ఈ భేదాలకు అతీతంగా ఏ వస్తువు అయితే అభేదంగా ఉందో దానిని దర్శిస్తాడు, వాడే నిజమైన జ్ఞాని, వాడే సత్పురుషుడు. బాలకృష్ణుని చంపమని కంసుడు పూతనని పంపుతాడు. పూతన తన స్థనంలో విషం పెట్టుకొని కృష్ణుడికి పాలు ఇస్తుంది. కృష్ణుడు దగ్గరకు వస్తుంది, లాలిస్తుంది, నెమ్మదిగా ఎత్తుకొంటుంది. ఈ భూమి భారాన్ని మోసే వాడిని ఎవరు ఎత్తుకోగలరు? వాడు ఇష్టపడితే మనం ఎత్తుకోగలము కాని వాడి ఇష్టం లేకపోతే మనం ఎలా ఎత్తుకొంటాము. పూతన కృష్ణుడిని ఎత్తుకొని విషం పాలు ఇస్తుంది. కృష్ణుడు ఏమి చేసాడు అంటే ఆవిడ పవిత్రురాలు కాకపోయినా ఆవిడ స్థనంలో ఉన్న విషంపాలు తాగి, ఆవిడకు పవిత్రత చేకూర్చి, పాడుబుద్ధిని తొలగించి సద్బుద్ధిని కలుగజేసి పూతనకి మోక్షం ఇచ్చాడు, వాడు కృష్ణుడు. ఎప్పుడూ కూడా దేవుడికి మొదలు, చివర చూడటానికి ప్రయత్నం చేయకూడదు, అది పొరపాటు, దేవుడికి మొదలులేదు, చివరలేదు. అచ్యుతా, అనంతా, గోవిందా ఇవి చాలు మనం పవిత్రులం అవ్వటానికి అని వ్యాసుడు చెపుతాడు. ఆయన నామాన్ని స్మరించటం వలననే మనం పవిత్రులం అయిపోతాము. అయితే మన దగ్గర దోషం ఏమిటి అంటే నామాన్ని ఇష్టంగా చేయము, అయిష్టంగా చేస్తాము, ఏదో ప్రయోజనం ఆశించి చేస్తాము. ఓ కృష్ణా! నిన్ను ప్రేమించటం కోసమే ప్రేమిస్తున్నాను అని హృదయ పూర్వకంగా నిండు మనస్సుతో అచ్యుతుడిని ఆరాధిస్తే ఇప్పుడే ఇక్కడే ఆయన దయను చూపించి మన బుద్ధిలో ఉన్న దోషాలను తొలగించి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, ఆయనే పరమాత్మ. ఆచార్యులవారు ఏమి చెప్పారు అంటే సూర్యుడు

ఎంత పెద్ద వాడైనా మేఘాలు అడ్డువస్తూఉంటే ఆయన మనకు కనబడడు. అదేవిధంగా మన హృదయంలో ఈశ్వరుడు ఉన్నప్పటికీ, మన బుద్ధిలో ఉన్న దోషాలు అనే మేఘాల వలన ఆయన మనకు గోచరించటం లేదు. కర్ణుడు భీష్ముడితో ఏమి చెపుతున్నాడు అంటే "పాండవులు మంచివారే కాని మంచి వారిని మంచి వారిగా గుర్తించనివ్వకుండా నా బుద్ధి మందగించింది, నేను చేసే స్నేహాల వలన నా బుద్ధి మొద్దుబారిపోయింది, చీకటి కింద అయిపోయింది, వెలుతురును చూడకుండా కళ్ళు మూసుకొని ఇంతకాలం జీవించాను. దేవాది దేవుడిని ఇంతకాలం గుర్తించలేకపోయాను, ఆ నల్లటివాడు లేనిచోటు అంటూ ఉండదు, ఆయన అంతర్యామే కాదు, సర్వజ్ఞుడు, మనలను నడిపే డ్రైవర్ ఆయనే. ఒకవేళ సుడిగుండాల కింద, మొసళ్ళ కింద పాండవులను పట్టుకొని పీడించి చంపేద్దాము అనుకొంటే ఆ నల్లటివాడు చంపనివ్వడు, నా ఆటలు ఆయన సాగనివ్వడు భీష్మా!" అంటాడు. "కర్ణా! ఇప్పడు నీవు నా హృదయాన్ని జయించావు, నా హృదయంలో స్థానం సంపాదించావు" అంటాడు భీష్ముడు.

నన్ను నమ్మినవాడు, నాకోసం జీవించేవాడు, నా భక్తుడు ఎన్నటికీ చెడిపోడు అని పరమాత్మ చెపుతున్నాడు. నీ బుద్ధిని, మనస్సును, ఇంద్రియాలను నీకు ఉన్న తెలివిని భగవంతుడి పాదాల దగ్గర అర్పించి ఎప్పుడైతే జీవిస్తున్నావో అప్పుడు భగవంతుడే గురురూపంలో వచ్చి, నీకు సత్యాన్ని బోధించి, సత్యం దగ్గరకు వెళ్ళటానికి నీ మనస్సును అంతర్ముఖపరచి, దానికి లోచూపు నేర్పి ఆ వస్తువు నీచేతికి అందేటట్లు చేసేవరకు ఆయన నిన్ను వెంటాడుతాడు, వాడే గురువు, వాడే ఈశ్వరుడు. భగవదనుభవం పొందాలి లేకపోతే ఆప్రయత్నంలో మరణించాలి అనేటువంటి పట్టుదల, ఆ తపన లోపలనుండి రాకపోతే ఎవరు ఎన్ని చెప్పినా ఏమీ ప్రయోజనం లేదు, అది రావటానికి ఎంతోకొంత పుణ్యబలం ఉండాలి, పుణ్యబలం లేకపోతే లోపల నుండి ఆ తపన రాదు. మీరు శరీరం ద్వారా కాని, మనస్సు ద్వారా కాని, వాక్కు ద్వారా కాని, భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశముల ద్వారా ఏదో రకంగా పుణ్యబలం సంపాదించాలి. భగవాన్ ఏమి చెప్పారు అంటే పులి నోటిలో పడ్డ మాంసపు ముక్క ఏవిధంగా అయితే తిరిగి రాదో అలాగే గురువు అనుగ్రహంలో పడినవాడు వాడి శరీరాలు మారినా, పరిసరాలు మారినా, వాడు ఏ లోకంలో ఉన్నా గురువు వాడిని వెంటాడి వాడికి మోక్షానుభవం కలిగేవరకూ, నిర్వాణసుఖం వాడికి అందేవరకు వాడిని విడిచిపెట్టడు, వాడు గురువు. ఒక మహారాజ్యాన్ని త్యాగం చేసిన, మోక్షసుఖంలో ఊగిసలాడుతున్నా కూడా బుద్ధుడు ఎంత సింపుల్‌గా, ఎంత నిరాడంబరంగా చెపుతున్నాడో చూడండి "నేను స్వతంత్రమైన సుఖాన్ని ఏ రకంగా పొందానో, ఎలా సాధన చేసి భయంలో నుండి భయరహితస్థితిని పొందానో నాకు తెలుసున్నంత వరకు చెపుతున్నాను, నాకు అంతా తెలుసును అని చెప్పటం లేదు" అన్నాడు బుద్ధుడు.

జ్ఞానికి, అజ్ఞానికి తేడా ఏమిటి అంటే జ్ఞాని శరీరానికి మరణం వచ్చినప్పడు నేను

మరణించటం లేదు, నేను ఉంటాను అని వాడికి అనుభవంలో తెలుస్తుంది కాని అజ్ఞాని శరీరానికి మరణం వచ్చినప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు. ఏ గురువు పట్ల మీ మనస్సు శృతికలుపుతోందో వారినే ఆరాధించండి, మీరు బాగుపడటం ముఖ్యం, అందరి ద్వారా పనిచేసేవాడు ఆ నల్లటివాడే. నువ్వు ఏ గురువును ఆశ్రయించినా, ఏ అవతార పురుషుడిని ఆశ్రయించినా నిన్ను అనుగ్రహించేవాడు వాడే. నీకు జ్ఞానం రావటంలేదని ఎంతమందిని తిట్టిపోస్తావు. నీకు జ్ఞానం రాకుండా ఎవరో ఇతరులు అడ్డురావటంలేదు, కామక్రోధములు ఏ మనస్సులో అయితే ఉన్నాయో ఆ మనస్సే అడ్డువస్తోంది అన్న సంగతి నీకు తెలియటంలేదు. గురువువస్తాడు, నీకు సత్యాన్ని బోధిస్తాడు, నీ లోపల ఉన్న వాసనలను కెలికి నీ సహస్రారంలోనికి తీసుకొని వస్తాడు, నీలో కామక్రోధముల వేగం ఎంత ఉందో చూసుకొంటూ ఉంటాడు. ఆ వేగం ఎలా తగ్గించాలి అని చూస్తాడు. సడన్ బ్రేక్‌లు వేయడు, సడన్ బ్రేక్ వేస్తే ఏక్సిడెంట్ అయిపోతుంది. నెమ్మదిగా నీతో కలిసి ఉంటూ, నీతో మాట్లాడుతూ మీరు బాగున్నారా? అంటాడు, అన్నం తిన్నారా? అని అడుగుతాడు, ఆర్థికపరిస్థితుల గురించి అడుగుతూ అతి సన్నిహితంగా ఉంటూ మీకు తెలియకుండా సర్జరీ చేస్తాడు, వాడు గురువు. మనం గురువును ప్రేమించ గలమా? ఆయన మీద ప్రేమ కలిగేటట్లు ఆయనే చేసుకొంటాడు. గురువు ఎప్పుడైనా మనకు జ్ఞాపకం వస్తూ ఉంటే అది మన తెలివి తేటలవలన కాదు, అది కూడా గురువు యొక్క దయే. చలంగారు అంటారు "భగవాన్ ఎక్కడికి పోయావు, నీపేరే జ్ఞాపకం రావటం లేదు, ఒకోసారి అత్యంత సమీపంలోనికి వస్తావు, ఒకోసారి దూరంగా ఎక్కడికో పోతావు, ఎన్ని ఆటలు ఆడుకున్నా నా బలహీనతలలో నుండి నన్ను విడుదలచేయటానికే కదా అంటున్నారు. నీ చూపు వెలుగులలో ఏ మాటున ఉన్నదో ఈ మహత్తర ప్రేమ, ఏ చాటున ఉన్నదో ఇంత అనంతశక్తి. ఈ సారే తాగే చలంలో, మాంసం తినే చలంలో ఇంత మార్పు తీసుకొని వచ్చావు అంటున్నారు" చలంగారు.

తుకారామ్ చెపుతాడు 'సారా తాగితే మత్తు వస్తుంది, భగవంతుడి నామాన్ని స్మరించినా మత్తు వస్తుంది. కాని సారా తాగటం వలన వచ్చే మత్తు నిన్ను బంధిస్తుంది, హరినామస్మరణ వలన వచ్చే మత్తు నిన్ను బంధం నుండి విడుదల చేసి మోక్షాన్ని ఇస్తుంది' అని అన్నాడు. గీతలో భగవంతుడు పని చేయమని చెప్పాడు కదా అని అడిగితే భగవాన్ ఏమి చెప్పారు అంటే 'నటించేవాడు కనబడకూడదు, నటన జరిగిపోవాలి. అది భగవంతుడు చెప్పిన కర్మ. యాక్టర్‌లెస్ యాక్షన్. నువ్వు ఆ స్థాయికి వెళితే వాసుదేవుడి యొక్క వైభవం నీకు తెలుస్తుంది. మోక్షం కోసం కంగారుపడవద్దు, ఎంజాయ్ కృష్ణా, మీకు ఇష్టమైన వస్తువు తింటున్నారు అనుకోండి మీరు ఎంత బాగా ఎంజాయ్ చేస్తారో అలాగ కృష్ణుడిని ఎంజాయ్ చెయ్యండి, మోక్షం తరువాత చూద్దాము. "హరేకృష్ణ, హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే హరే రామ, హరే రామ, రామ రామ హరే హరే" అంటూ ఆ నామం మన చెవిలో పడాలని వీధులలో భజన చేసుకొంటూ శ్రీకృష్ణ

చైతన్య వెళుతూ ఉంటే కొంతమంది దేవుడి మీద నమ్మకం లేనివారు ఏమిటి ఈ పబ్లిక్ న్యూసెన్స్ అనుకొనేవారు. వారి మాటలను ఆయన పట్టించుకోలేదు, ఆ మాటలకు కోపం తెచ్చుకోలేదు, వారు ఎక్కడో ఉన్నారు మన మాటలు, విమర్శలు అంత దూరం వెళ్ళలేవు. శ్రీకృష్ణచైతన్య దగ్గర ఒక ముస్లిం భక్తుడు ఉండేవాడు, ఒకసారి చైతన్యుడు ఆనంద సముద్రంలో ఉన్నాడు 'నీకు ఏమి కావాలో కోరుకో?' అని ఆ ముస్లిం భక్తుడిని అడిగాడు. వారి భక్తి చూస్తే మనకు వళ్ళు పులకరిస్తుంది. ఆ ముస్లిం భక్తుడు ఏమన్నాడు అంటే 'నాకు ఏమీ అక్కరలేదు. నువ్వు లేని ఈ ప్రపంచాన్ని నేను చూడలేను అందుచేత నీ ముక్కులో గాలి పోకముందే నా ముక్కులో గాలి పోవాలి, అదే నేను కోరుకునేది' అన్నాడు. చివరకు శ్రీకృష్ణ చైతన్య ఆ భక్తుడి శవాన్ని తన చేతులతో సమాధి చేసాడు. ఇప్పటికీ పూరిజగన్నాథంలో సముద్రం ఒడ్డున ఆ సమాధి ఉంది. కర్తృత్వంతో ఏ పనిచేసినా మంచికి మంచి, చెడ్డకు చెడ్డ నీకు అనుభవంలోనికి వస్తుంది. కర్తృత్వం లేకుండా, అహంకారం లేకుండా నీవు మూడు లోకాలను దహనం చేసినా నీకు పాపం అంటదు, కర్తృత్వంతో చేసేవా నీ శరీరం కూడా నీడ వచ్చినట్లు నీవు చేసిన కర్మ నీకూడా వచ్చేస్తుంది, అది అనుభవించేవరకు నిన్ను వదిలిపెట్టదు. ఇప్పుడు నీవు ఎలా చేస్తున్నావో అలా కర్మ చేయమని భగవంతుడు చెప్పలేదు, లోపల నేను చేస్తున్నాను అనే భావన లేకుండా పని చేయమని భగవంతుడి భోద.

మనం అధ్యయనం చేసినా, పూజ చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా, విచారణ చేసినా గమ్యం ఆత్మజ్ఞానం మీద ఉంటే నీకు పునర్జన్మతో సంబంధం లేకుండా ఈ శరీరంలో ఉండగానే, ఇప్పడే, ఇక్కడే నీకు మోక్షస్థితిని ప్రసాదిస్తాడు, వాడే గురువు, వాడే ఈశ్వరుడు. ఎవడైతే రాగద్వేషములనుండి విడుదలపొందాడో వాడు ఎటుచూసినా, ఏమి చేసినా వాడికి ఆత్మానందమే. మోక్షం మాట తరువాత చూద్దాము, ముందు భగవంతుడిని ఎంజాయ్ చేయండి. తుకారామ్ ఏమంటున్నాడు అంటే "ఓ కృష్ణా! ఓ పాండురంగా! నీ నామం చేసుకొంటూ ఉంటే తియ్యటి మిఠాయిలలో కూడా నాకు రుచి కనిపించటం లేదు. మనం రామరామ అన్నా పలావు దగ్గరకు వచ్చే వరకే. కాని తుకారామ్ ఏమంటున్నాడు అంటే "నీ నామం చేసుకొంటూ ఉంటే పలావు ఎదురుగా పెట్టినా దాని మీద ఆకర్షణ కలగటం లేదు" అంటున్నాడు. "ఈ సృష్టిలో అనేక ఆకర్షణలు, అనేక అద్భుతాలు, అనేక ప్రలోభాలు ఉన్నాయి. నీ నామం చేస్తూ ఉంటే ఓ కృష్ణా అవి ఏమీ నన్ను ఆకర్షించటం లేదు" అన్నాడు తుకారామ్. భగవంతుని నామమే మనలను ప్రకృతి గుణాలనుండి విడుదల చేస్తుంది, మనం కర్మ చేస్తున్నా దాని ఫలితం అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా దాని మీద ఆసక్తి పోతుంది. "ఎవరికైనా సహాయ సహకారములు చేసినా, సమాజానికి ఎంతో కొంతమంచి అందించాలి అనుకొన్నా వీరు నా పనే చేస్తున్నారు, నా గురించే జపిస్తున్నారు" అని భగవంతుడు అనుకొంటాడు. "మంచితనం,

భగవంతుడు వేరుకాదు" అంటాడు సోక్రటీసు. భగవంతుడి నామాన్ని ఎంజాయ్ చెయ్యండి, భగవంతుడి వైభవాన్ని ఎంజాయ్ చెయ్యండి. మోక్షం, నిర్వాణస్థితి వీటి గొడవ తరువాత చూద్దాము. ఈశ్వరుడి యొక్క ఔన్నత్యాన్ని జుర్రుకోండి. ఏది, ఎప్పుడు, ఎక్కడ ఇవ్వాలో ఆ ముహూర్తం ఆయన పెట్టుకొంటాడు. తిలక్‌గారు కొన్ని సంవత్సరాలు జైలులో ఉన్నారు అప్పుడు టైము పాడుచేసుకోకుండా గీతకు వ్యాఖ్యానం వ్రాసారు. మనకు ఏదైనా కష్టం వస్తే టైము పాడుచేసుకొంటాము. తిలక్‌గారు ఆ కష్టాన్ని దేవుడే పంపాడనుకొంటూ, ఆ కష్టాన్ని తపస్సుగా భావించి గీతకు వ్యాఖ్యానం వ్రాసారు. కర్త ఈశ్వరుడు, ఫలితం ఆయన చేతిలో ఉంది. భగవంతుడు నీ శరీరానికి ఏ పని అయితే కేటాయించాడో అది హృదయ పూర్వకంగా, నిండు మనస్సుతో, భక్తితో ఆచరించండి. పనిచెయ్యి ఆసక్తి లేకుండా చెయ్యి, నీకు చిత్తశుద్ధి కలుగుతుంది, కాలప్రవాహంలో నీకు మోక్షం వస్తుంది. కర్మను సన్యసించటం కాదు, కర్మను ఆచరిస్తూ దాని ఫలాన్ని త్యాగం చేసేవారు, అంటే కర్మఫలత్యాగులు గొప్పవారు, వారే నిజమైన సన్యాసులు. కోరిక, కోపం, ద్వేషం లేకుండా పని చేయండి. "నేను అది సాధించాను, నేను ఇది సాధించాను, నేను గొప్ప గొప్ప లోకాలకు వెళ్ళిపోతాను అని నువ్వు అనుకొంటున్నావు కదా, ఈ అనుకొనేవాడు ఎవడు? వాడే సైతాను, వాడిలోనుండి బయటకు రా!..." అంటున్నారు భగవాన్. "వాడు ఎక్కడ నుండి వస్తున్నాడో పరిశీలించు, దేహము నేను అనే తలంపు నీకు లోపల నుండే వస్తోంది. ఆ తలంపును పట్టుకొని వెంటాడి ఆ తలంపు ఉదయించిన చోటును చూడగలిగితే ఈ సైతాన్ అదృశ్యమయిపోతుంది, ఆ మూలతలంపు మూలంలో ఉన్నది పరమసత్యం, దానికి తలంపులు లేవు, అది నీకు వ్యక్తమవుతుంది, అదే నీ గమ్యం" అంటున్నారు భగవాన్.

శరీరం వచ్చింది అంటే ఏదో రోజు మరణిస్తుంది, అది ప్రకృతి సహజం, దాని గురించి బాధపడవద్దు. 'భగవంతుడు జన్మరహితుడు, కర్మరహితుడు. ఈ చిన్న విషయం మీకు అర్థం అయినా మోక్షం వస్తుంది' అంటున్నాడు పరమాత్మ. గురువును ఆశ్రయించు, గురువు చెయ్యి పట్టుకో, గురువును సేవిస్తూ ఉంటే, ఆయనను ప్రేమిస్తూ ఉంటే నీకు ఏ కారణం వలన దుఃఖం వస్తుందో ఆ కారణాన్ని ఎలా తొలగించాలో గురువు చూసుకొంటాడు. గురువు యొక్క ప్రేమ పుష్కలంగా ఉంటుంది, ఆయన ప్రేమ అపురూపంగా ఉంటుంది. మీరంటే మీ అమ్మగారికి బాగా ఇష్టం అనుకోండి, గురువు ప్రేమను తల్లి ప్రేమతో పోలిస్తే గురువును అవమానించినట్లే. గురువు ప్రేమతో పోల్చటానికి మేచింగ్ అంటూ ఏమీ లేదు. సముద్రం ఎంత నిండుగా ఉంటుందో, గురువు ప్రేమ కూడా అంత నిండుగా ఉంటుంది. కనీసం గురువు యొక్క ప్రేమ నీకు అర్థమయినా మోక్షం వస్తుంది. గురువు దయ చాలు, ఆయన చూపు చాలు మీకు శాంతి రావటానికి, కష్టపడి గుంజీలు తీయనక్కరలేదు. మీరు నామం చేసేటప్పుడు మీ మనస్సు, ఇంద్రియాలు అక్కడ ఉండాలి. నామం ప్రీతితో, భక్తితో, శ్రద్ధతో హృదయపూర్వకంగా చేస్తే

నామం వలననే మనం తరిస్తాము.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-09-05, అరుణాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

పుస్తకాలు చదవటం వలననే ఆత్మజ్ఞానం రాదు. చదవటం వలన నీవు సంపాదించిన నాలెడ్జి ఆత్మజ్ఞానం పొందటానికి కొంతవరకు సహాయం చేస్తుంది. శరీరం, మాట, మనస్సు ఇవి మూడూ పనిముట్లు, వీటిని మనం ప్రోపర్‌గా ఉపయోగించుకోవాలి. మనం కంగారు పడితే ఆత్మజ్ఞానం వచ్చేయదు, పిందిని మనం కోసి ముగ్గేస్తే అది ముగ్గదు, కుళ్ళిపోతుంది. శరీరం, మాట, మనస్సు వీటిని మనం ప్రోపర్‌గా ఉపయోగించుకొంటూఉంటే నెమ్మదిగా, సహజంగా ఆత్మజ్ఞానం వస్తుంది. "ప్రతీవాడి మనస్సులో మంచి, చెడ్డ రెండూ ఉంటాయి. ఇందులో మనం దేనికి అన్నం పెడుతున్నాము అనేది మనం చూసుకోవాలి" అని బుద్ధుడు చెప్పాడు. మంచికి అన్నం పెడుతూ ఉంటే చెడ్డ తగ్గుతూ ఉంటుంది, చెడ్డకు అన్నం పెడుతూ ఉంటే మంచి తగ్గుతుంది. దేనికి అన్నం పెడుతున్నామో చూసుకోకుండా ఏవో పుస్తకాలు చదవటం వలన వచ్చేది సున్నా. చెడ్డకు అన్నం పెడుతూ రామా, రామా అంటే ఆత్మజ్ఞానం వచ్చేస్తుందా? మనం దేనికి అన్నం పెడుతున్నాము అనేది జాగ్రత్తగా చూసుకోవాలి, అదే నిజమైన సాధన. కొంతమందికి బాహ్యంగా కారణాలు ఏమీ కనబడవు, భయం వస్తూ ఉంటుంది. లోపల ఉన్న భయం కూడా చెడ్డలో భాగమే. అందువలన భయానికి కూడా ఫీడ్ చేయవద్దు. భయం ఎక్కువ అవ్వటం వలన మెంటల్ హాస్పటల్‌కు వెళ్ళాలి. వారు ఇచ్చే మందుల వలన భయం తగ్గదు, భయం అణుగుతుంది. రోగాన్ని అణచటం వేరు, రోగాన్ని తగ్గించుకోవటం వేరు. ఇతరులను చూసి అసూయపడటం ఎటువంటిదో భయం కూడా అటువంటిదే. హృదయంలో ఏమి జరుగుతుందో చూసుకోకుండా యాంత్రికంగా శివ, శివ అంటే సరిపోదు. శరీరం ద్వారా, మాటద్వారా, మనస్సు ద్వారా చెడుకు ఫుడ్ సప్లయి అవ్వకుండా చూసుకోవాలి, అదే సాధన.

మన దేహం చనిపోయే రోజుకు నూటికి నూరుపాళ్ళు ఆనందంలో ఉంటే ఇంక జన్మరాదు. మనం 99% ఆనందంలో ఉన్నా పునర్జన్మ వచ్చేస్తుంది. పుట్టుక వస్తే మరణం వచ్చేస్తుంది, అలా రిపీట్ అయిపోతూ ఉంటుంది. మనం రోజూ ఏడుస్తూ ఉంటాము, మనలో ఏడుపు ఇంకా ఉంటే ఏడవటానికి మరల పుడతాము. మనం ఏదైనా మంచి వాక్యం వింటే దానిని మనస్సులో తిప్పకోవాలి, అప్పుడు అది మనస్సులో స్థిరపడుతుంది, అప్పుడు మనలో ఉన్న మంచికి ఫుడ్ సప్లయి అవుతుంది. మనం కొంతమందిని ప్రేమించి, కొంతమందిని ప్రేమించలేకపోతే లోపల చెడు ఉందని అర్థం. దానిని మనం తొలగించుకోవాలి. పొయ్యిలో పుల్లలు మార్చి మార్చి పెడుతూ ఉంటాము, పుల్లలు మారుతూ ఉంటాయి, మంట కంటిన్యూ

అవుతుంది. అలాగే నీ సమస్యలు వేరువేరుగా ఉండవచ్చు కాని జన్మలు కంటిన్యూ అవుతూ ఉంటాయి. షేరింగ్, కేరింగ్, కైండ్‌నెస్ ఇవి మూడూ గుర్తుపెట్టుకోవాలి. మనలో ఎంతోకొంత కైండ్‌నెస్ ఉంటేనే ప్రజలతో షేర్ చేసుకోవాలనిపిస్తుంది. ఎప్పుడైతే షేరింగ్ వచ్చిందో అప్పుడు కేరింగ్ కూడా వస్తుంది. మనకు షేరింగ్, కేరింగ్, కైండ్‌నెస్ ఇవి మూడూ లేవు, ఈ అనారోగ్యాన్ని కవర్ చేసుకోవటానికి రామరామ అనటం నేర్చుకొన్నాము, యంత్రంలా తిప్పుకొంటున్నాము కాని మనస్సును అక్కడ పెట్టటంలేదు. "నీవు ఇతరులను సుఖపెట్టాలన్నా, ఇతరులద్వారా నీవు సుఖపడాలన్నా ఎంతోకొంత కైండ్‌నెస్ ఉండాలి" అని వర్డ్స్‌వర్త్ చెప్పాడు. కైండ్‌నెస్‌ను సమాజానికి ఇస్తూఉంటే అది నీకు తిరిగి వస్తూఉంటుంది. దేవునికి మరో రూపమే ఈ సృష్టి. రోజూ మనం నిద్రపోయే ముందు ఒకటి చూసుకోవాలి. ఈరోజు మనం ఎన్ని మెర్సీ యాక్ట్స్ చేసాము, ఎన్ని క్రూయల్ యాక్ట్స్ చేసాము అంటే దయతో ఎన్ని పనులు చేసాము, క్రూరత్వంతో ఎన్ని పనులు చేసాము అది మీరు చూసుకోవాలి. ఒకవేళ క్రూరత్వంతో పనులు చేసినా బెంగపెట్టుకొని కూర్చోకుండా, అటువంటి పనులు రేపు చేయకుండా చూసుకోవాలి, వాటిని తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయాలి. శరీరం ఏదో రోజు చనిపోతుంది కాని లైఫ్ కంటిన్యూ అవుతుంది. అందువలన మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏవో మంచిపనులు చేయటం వలన లిబరేషన్‌రాదు, మంచిపనులు చేయటం వలన పుణ్యం వస్తుంది. మనకు సరియైన అవగాహన ఉండాలి. మనలో ఎవరికైనా సఫరింగ్ పూర్తి అయితే ఇంక వారికి పుట్టుక రాదు. ఇక్కడ సఫరింగ్ లేకుండా ఎవరైనా ఉన్నారా? మనం నోటితో సఫరింగ్ లేదు అని చెప్పినా లోపల అంతర్యామి ఉన్నాడు కదా ఆయన ఇదంతా చూస్తూ ఉంటాడు. లోపల సఫరింగ్ వస్తూ ఉంటే జీవితం కంటిన్యూ అవుతుంది.

'ఎవరైనా చెపుతూ ఉంటే వింటున్నాను కాని జ్ఞానం సంపాదించాలి అనే తపన రావటం లేదు' అని ఒకరు అడుగుతున్నారు. పూర్వజన్మల నుండి వచ్చిన పుణ్యబలం తక్కువగా ఉంటే ఆ తపన రావటం లేటు అవుతుంది, అలాగని శ్రవణం చేయటం మానకూడదు. 'పెద్ద పెద్ద తపస్సులు చేసి శరీరాన్ని, మనస్సును శుభ్రంగా ఎండబెట్టేసి వారు ఏస్థితిని పొందుదామని ప్రయత్నం చేస్తున్నారో, కృష్ణుడిని ప్రేమించి ఆస్థితిని నేను పొందాను' అని రాధ చెప్పింది. 'తపస్సులు చేసినవారు ఆస్థితిని పొందినా పొందకపోయినా, కృష్ణుడిపట్ల పవిత్రమైన ప్రేమ వలన నేను ఆ స్థితిని పొందాను' అంది రాధ. నీవు తపస్సు చేసి కోపం పెంచుకొంటూఉంటే దానివలన ప్రయోజనం ఏమిటి? నీవు తపస్సు చేస్తూ దేనిని ఫీడ్ చేస్తున్నావు? తపస్సు చేసేవారికి ప్రక్కన ఏదైనా డిస్ట్రబెన్స్ వస్తే వారిని శపించేయాలి అనిపిస్తుంది. అంటే వాడు తపస్సు చేసి దేనికి ఫీడ్ ఇస్తున్నాడు అంటే చెడ్డకు ఫీడ్ చేస్తున్నాడు, చెడ్డకు ఆహారం అందుతూ ఉంటే తపస్సు వలన ప్రయోజనం ఏమిటి? అది మనం జాగ్రత్తగా వాచ్ చేసుకోవాలి. అందరూ మనలను

మెచ్చుకోవాలి అని ఎవరైనా అనుకొంటూ ఉంటే, అది లోకవాసన, ఇంక ఆ మనిషికి జ్ఞానంరాదు. అనుకొనేవాడు జీవుడు, నిర్ణయించేవాడు ఈశ్వరుడు. ఏదో మనస్సు ఉంది కాబట్టి అనుకొంటాము. నువ్వు కృషి మానవద్దు. ఫలితం ఈశ్వరుడి చేతిలో ఉందని కృషి మానివేస్తే పాడైపోతావు. అనుగ్రహించేది ఈశ్వరుడే, నా కృషి వలన వచ్చింది అనుకొంటే మరల నీకు గర్వం వస్తుంది, గర్వం వలన మనం పాడైపోతాము. శవం కనబడితే భయం వేస్తోంది అని ఒకరు నాన్నగారిని అడుగుతున్నారు. మీరు భయపడవద్దు, శరీరమే శవం అంతకంటే ఏమీ లేదు. మన శరీరం కూడా ఏదోరోజు శవం అవుతుంది. శవాన్ని కూడా మీరు గౌరవంగా చూడాలి. శవ సంస్కారం మీరు శ్రద్ధగా ప్రేమగా చేయాలి. శవాన్ని కూడా ముద్దు పెట్టుకొనేంత స్థాయికి మనం ఎదగాలి.

ఈరోజు మనకు శాంతిగా ఉండవచ్చు, రేపు అశాంతి రావచ్చు. ఈ రోజు సుఖంగా ఉన్నాము అనుకోండి, రేపు దుఃఖం రావచ్చును. మోక్షం అంటే శాశ్వతంగా దుఃఖం రాకూడదు. శరీరం ఉండగా దుఃఖం రాకూడదు, శరీరం మరణించాక కూడా దుఃఖం రాకూడదు. మీకు దుఃఖం వస్తూ ఉంటే మీరు చాలా బాగున్నారు అని ఇతరులు అంటే ఆ మాటల వలన ప్రయోజనం ఏముంది. అది ఎవరిమటుకు వారు చూసుకోవాలి, కాపీ కొట్టినట్లు ఉండకూడదు. మీరు తలపోటుతో బాధపడుతున్నారు అనుకోండి, మీకు తలపోటు లేదు, బాగున్నారు అంటే ఆ మాటలు ఎందుకు? వాటివలన ప్రయోజనం ఏమిటి? డబ్బును బట్టి దుఃఖం పోదు, మీరు లోపల దుఃఖంలేనిస్థితిని పొందాలి. లోకం గొడవలలోనికి అతిగా వెళ్లవద్దు, మీకు ఎంతవరకు అవసరమో అంతవరకు వెళ్లండి. బింది నీళ్ళు మనం ఒకేసారి తాగము, మనకు ఎంతవరకు అవసరమో అంతే తాగుతాము. అలాగే లోకం గొడవలలో ఎంతవరకు అవసరమో అంతవరకే ఉండాలి, అతి పనికిరాదు. లోకం గొడవలలో అతిగా ఉంటే మీకు లోపల వెతుక్కోవటానికి టైము ఉండదు, ఈలోపు మీకు చావు వచ్చేస్తుంది. మీకు లోకవాసన ఉంటే ఎద్దు వెనకాల బండి ఎలా వస్తుందో, కారు వెనకాల దుమ్ము ఎలా వస్తుందో అలాగ మనిషి వెనకాల దుఃఖం వచ్చేస్తుంది. ఇప్పడు బాగానే ఉన్నాము, మరల దుఃఖం వచ్చేస్తుంది, ఎందుకు వస్తోంది? అని జాగ్రత్తగా ఎవరికి వారు చూసుకోవాలి. దుఃఖం వస్తూఉంటే మనకు మోక్షం రానట్లే. దుఃఖం వస్తూఉంటే శరీరాలు వస్తాయి, శరీరం వస్తే మరల మరణం వచ్చేస్తుంది, దీనిని ఎవరు ఆపలేరు. కోటి రూపాయలు పెట్టి కిడ్నీ కొనుక్కోగలరు కాని కోటి రూపాయలు పెట్టి దుఃఖంలేనిస్థితిని కొనుక్కోలేము. మీరు ఇంటి దగ్గర కూర్చొని దుఃఖంలేనిస్థితిని పొందగలిగితే సరేసరి, అప్పడు ఇంక మంచివారితో సహవాసం కూడా మీకు అక్కరలేదు. చేతినిండా డబ్బు ఉన్నప్పడు బ్యాంక్‌లో నుండి అప్పలు తెచ్చుకోవటం ఎందుకు? అలా మీ అంతట మీరు పొందలేకపోతే మోక్షం పొందిన వారితో సహవాసం చెయ్యండి. అనుకరణ వద్దు, ఎవరి పద్ధతిలో వారు ఉండండి.

వారు అలా ఉన్నారు మనం కూడా అలా ఉండాలి అనుకొంటే చివరకు సున్న అయిపోతారు. మీకు సుఖం లేనప్పడు ఎవరో ఇతరులు మీరు బాగా ఉన్నారు అనుకోవటం వలన, అటువంటి మాటల వలన మీకు ఏమీ కలిసిరాదు.

కొంతమంది మంచిజన్మ రావాలి అని భగవంతుడిని కోరుకొంటారు. వారికి మంచిజన్మ రావచ్చు కాని మోక్షం రాదు. మంచి జన్మ వస్తే ఎంతకాలం ఉంటుంది? అది జాగ్రత్తగా చూసుకోండి. భగవంతుడు కూడా వారు అడిగినది వారికి ఇచ్చాము, అడగనిదాని గురించి మనకు ఎందుకు అని ఆయన ఊరుకొంటాడు. మీరు ప్రయాణించే మార్గం సరియైనది అయిఉండాలి, ఆ రోడ్డు కరెక్టు అయిఉండాలి. అంతేకాని మీరు మద్రాసు వెళ్ళాలి అనుకొంటూ బెంగుళూరు వెళ్ళే రోడ్డులో ప్రయాణం చేస్తూ ఉంటే ఎంత ప్రయాణం చేసినా మద్రాసు వెళ్ళలేరు. మీరు వెళ్ళే మార్గం కరెక్ట్ అయితే, మీరు నెమ్మదిగా వెళ్ళినా, కొంత లేటు అవుతుంది గాని గమ్యానికి చేరతారు. చనిపోయిన తరువాత ఉంటాము, ఉండము ఆ గొడవలు అనవసరం, ఇప్పడు దుఃఖంలేనిస్థితిని పొందటానికి ప్రయత్నం చేసుకోండి. మనం దుఃఖంలో ఉంటాము అనుకోండి, చనిపోయిన తరువాత కూడా మనం ఉంటే మాత్రం, దానివలన ప్రయోజనం ఏమిటి? లోకవాసన ఉందో, లేదో మనం లోపల చూసుకోవాలి. మీకు లోకవాసన ఉంటే సుఖంరాదు, దుఃఖంలేనిస్థితిని పొందలేరు. మీకు తాత్కాలికంగా సుఖం వచ్చినా లోకవాసన ఉన్నప్పడు ఆ సుఖం నిలబడదు. మోక్షం అంటే సుఖం శాశ్వతంగా ఉండాలి. ఇప్పడు సుఖంగా ఉండి, మరల దుఃఖం వచ్చేస్తూ ఉంటే అది మోక్షం కాదు. ఈ శరీరం చనిపోయినా జీవితం కంటిన్యూ అవుతుంది. జీవితం ఉన్నా అక్కడ దుఃఖం ఉన్నప్పడు ఆ జీవితాన్ని ఏమి చేసుకొంటారు. ఇప్పడు ఈ శరీరం ఆరోగ్యంగా ఉంది, ఇంకో గంటకు ఏదైనా రావచ్చు, మనస్సు కూడా అంతే. ఇప్పడు మనకు ఒక రూపం ఉంది, దానికి ఒకపేరు ఉంది, మరల ఇంకో రూపం వస్తుంది, దానికి ఒక పేరు ఉంటుంది, అలా రూపాలు, పేర్లు మారిపోతూ ఉంటాయి. మీకు దుఃఖం వస్తూఉంటే ఈ రూపాలను, నామాలను ఏమి చేసుకొంటారు. మీరు చాలా పెద్ద హాస్పటల్‌లో వైద్యం చేయించుకొన్నారు అనుకోండి, అయినా చనిపోతే ఆ హాస్పిటల్ వలన ప్రయోజనం ఏమిటి? మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, రామరామ అనుకొంటారు అనుకోండి, ఒక గంట ఆ దుఃఖం ఆగిపోతుంది, మరల దుఃఖం వచ్చేస్తుంది. ఇప్పడు మీకు ఒక లక్ష ఉంది అనుకోండి, దానిని పెంచుకోవాలని చూస్తున్నారు, అంటే మీ సంపదను అభివృద్ధి చేసుకోవాలి అని చూస్తున్నారు.

ఇప్పడు మీ మనస్సు ఏ స్థితిలో ఉందో దానిని దాటి అంతకంటే పైస్థితికి తీసుకొని వెళ్ళాలి అని ఎవరూ చూడటం లేదు, అక్కడ ఫెయిల్ అయిపోతున్నాము. సాధన చేసి పై స్థితికి వెళ్ళారు అనుకోండి చనిపోయిన తరువాత ఆస్థితి మనకూడా వచ్చేస్తుంది కాని భౌతికంగా

మీరు సంపాదించిన ధనం మాత్రం మరణానంతరం మీకూడా రాదు. 'మీ కూడా వచ్చే దాని గురించి వదిలేసి, మీకూడా రానిదాని గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకొంటున్నారు' అన్నాడు ఏసు. డబ్బు పెట్టి బంగారం, ఆస్తులు కొనుక్కోగలం గాని మోక్షం కొనుక్కోలేము, అది డబ్బుకు చేతకాని పని. సుఖం అంటే ఏమిటి? అని ఒక డాక్టరు గారు అడిగారు. మీరు ఉన్నారా? అని డాక్టరు గారిని అడిగాను, ఉన్నాను అని చెప్పారు. మీరు లేనప్పడు, సుఖం అంటే ఏమిటో మీకు తెలుస్తుంది అని చెప్పాను. మీకు ఇంద్రియాలు ఉన్నా ఇంద్రియాలు లేనట్లుగా ఎవరు జీవిస్తున్నారో వారు సన్యాసి అని శాస్త్రంలో చెప్పారు. ఆ స్థితికి వచ్చాక ఇంక చూడటానికి, వినటానికి ఏమీ ఉండదు. కళ్ళు ఉన్నా కళ్ళులేని వాడితో సమానంగా, చెవులు ఉన్నా చెవిటి వాడితో సమానంగా ఎవడు ఉంటున్నాడో వాడు సన్యాసి. ఆచార్యులవారు భగవద్గీతకు భాష్యం వ్రాస్తూ కృష్ణుడు స్వయంగా భగవంతుడు అన్నారు. నూటికి నూరుపాళ్ళు శరీరం లేనివాడే కాని మనకోసం శరీరం ధరిస్తున్నాడు, శరీరంతో మనకు కనిపిస్తున్నాడు. ఆయన సాకారుడు అదే టైములో నిరాకారుడిగా కూడా ఉంటాడు. ఈ సాకారానికి, నిరాకారానికి అతీతంగా ఉన్నాడు, వాడికి నమస్కరిస్తూ ఈ భాష్యాన్ని ప్రారంభిస్తున్నాను అని ఆచార్యులవారు చెప్పారు. మనం ఈరోజు సంతోషంగా ఉన్నాము, మరల రేపు దుఃఖం వచ్చేస్తోంది, ఎందువలన? అని మనం చూసుకోవాలి. నదిలో నీరు ఎలా ప్రవహిస్తుందో అలాగ మనకు సుఖం ప్రవాహంలా ఉండాలి, బ్రేక్ అవ్వకూడదు. కోరిక వలన, కోపం వలన, భయం వలన మనకు దుఃఖంవస్తోంది. భయానికి కారణం ద్వైతం. అద్వైతానుభవం పొందేవరకు భయం వస్తూనే ఉంటుంది.

పూజలు చేయించుకొంటే బుద్ధిలోని దోషాలు పోతాయా? అని అడుగుతున్నారు. మీరు అడిగే ప్రశ్న ఎలాగ ఉంది అంటే లోపల కేన్సర్ ఉంటే పైన కొబ్బరినూనె వ్రాస్తే పోతుందా? కొబ్బరినూనె చేసే పని అది చేస్తుంది, చర్మాన్ని సాఫ్ట్ చేస్తుంది, కేన్సర్‌ను అది ఎలా తొలగిస్తుంది, దానికి సంబంధించిన వైద్యం చేయించుకోవాలి. దేహవాసనలో నుండి ద్వైతం వస్తుంది, రోగం అంతా అక్కడే ఉంది. గీతలో ఏమని చెప్పాడు అంటే నీకు రీలైజేషన్ వచ్చాక ఇంతవరకు నీవు విన్న విషయాల మీద, చూసే విషయాల మీద ఆసక్తి పోతుంది, చూడటానికి వినటానికి ఏమీ మిగలదు అన్నాడు. అంతటా నీరు దొరికేటప్పడు ఇంక నీకు చెరువుతోటి, నూతితోటి పని ఏముంది? వాటి చుట్టూ తిరిగేపని నీకు ఎందుకు? అన్నాడు. మీకు ఎలా బాగుంటే అలా చెయ్యండి, మీరు ఆలోచించుకొని చెయ్యండి అని ఉపనిషత్ చెప్పదు, ఇలా చెయ్యండి అని డిక్టేట్ చేస్తుంది. నేను చెప్పేది చెప్పాను, నీ ఇష్టం అంటాడు కృష్ణుడు గీతలో. కానీ ఉపనిషత్ అలా చెప్పదు, శాసనమే. ఉపనిషత్‌లలో, వారు దర్శించి చెపుతున్నారు కాబట్టి ఇంక మనకు ఛాయిస్ ఇవ్వరు, శాసించటమే. భగవంతుడు మనకు ఇచ్చిన జీవితాన్ని సక్రమంగా ఉపయోగించుకోవాలి. శరీరాలు మారుతూ ఉంటాయి కాని జీవితం కంటిన్యూ అవుతుంది.

మీకు మోక్షం కావాలంటే సక్రమంగా జీవించండి, జీవితాన్ని ఎంజాయ్ చేయండి, ప్రకృతిని ఎంజాయ్ చేయండి, సత్పురుషుల సహవాసాన్ని ఎంజాయ్ చేయండి. మీరు నూటికి నూరు పాళ్ళు ఆనందంలోఉంటే, శాశ్వత సుఖంలో ఉంటే అప్పుడు ఇంక మీకు పునర్జన్మ ఉండదు. మీ పేరు మోహన అనుకోండి. మోహన కనిపిస్తూ ఉంటే ఆ కనిపించే మోహనకు పునర్జన్మ వస్తుంది. మోహన ఎక్కడ ఉంది అని వెదికినా మోహన కనబడకూడదు, అప్పుడు పునర్జన్మ నుండి విడుదల పొందుతావు. నీవు ఇతరులకు ఉపకారం చేయాలంటే పేరు కనిపించకపోతే ఉపకారం చేయగలవు.

మనకు ఏరకమైన దుఃఖం ఉన్నా పునర్జన్మ ఆగదు. ఈ శరీరం ఉండగా పాత దుఃఖం పోవాలి, కొత్త దుఃఖం రాకుండా చూసుకోవాలి, అదే సాధన. కాని మన పరిస్థితి ఎలాగ ఉంది అంటే పాత దుఃఖం పోగొట్టుకోలేకపోతున్నాము, కొత్త దుఃఖాలు తెచ్చుకొంటున్నాము, అవి ఇవి కలిపి ఎక్కువయిపోతున్నాయి. అంటే పాత అప్పులు తీర్చలేక పోతున్నాము, కొత్త అప్పులు చేస్తున్నాము. పాత దుఃఖాలు పోవటంలేదు, కొత్తవి వచ్చేస్తున్నాయి. ఈ చక్రంలోనుండి బయటకు రాలేకపోతున్నాము. ఇది ఎవరిమటుకు వారు చూసుకోవాలి. మీరు హిందువులా? క్రైస్తవులా? మీ శరీరం రంగు ఎర్రగా ఉందా? నల్లగా ఉందా? ఇటువంటి గొడవలు అంటే మీ మతం గురించికాని, మీ శరీరం రంగు గురించి కాని ఇవి ఏమీ భగవంతుడికి అక్కరలేదు, ఇవి అన్నీ చూసేవాడు జీవుడు. మీలో దుఃఖం ఉందా? లేదా? అని భగవంతుడు చూస్తాడు. రోజూ పూజలు చేయించుకొని కొత్త అప్పులు చేస్తూ ఉంటే ఎలాగ? కొత్త దుఃఖాలు రాకుండా చూసుకోవాలి, పాత దుఃఖాలు పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయాలి. శరీరానికి మరణం వచ్చేలోపు మన కప్పు నిండుగా ఉండాలి, కాఫీ కప్పు కాదు, సుఖం కప్పు నిండా ఉండాలి, అప్పుడు పునర్జన్మ ఆగుతుంది. భగవంతుడు ఆనంద స్వరూపుడు. ఆయన ఎంత ఆనందం పొందుతున్నాడో అంత ఆనందం మనం పొందితే గాని ఆయన స్వరూపం మనకు ఇవ్వడు, ఒకవేళ పేచీలు పెట్టుకొన్నా ఇవ్వడు, పేచీల వలన ఉన్నది పోతుంది. నీ దగ్గర డబ్బు ఉంది అనుకో సమాజానికి ఉపయోగపడగలవు, నీ దగ్గర డబ్బు లేకపోతే సమాజానికి ఏదైనా చేయాలన్నా చేయలేవు. జ్ఞానం కూడా అంతే. నీవు జ్ఞానం సంపాదిస్తే అది ఇతరులకు పంచి ఇవ్వగలవు. నీకే జ్ఞానం లేకపోతే ఇతరులకు ఏమి ఇవ్వగలవు. జ్ఞాన సముపార్జనకు, నీ కోసమే నీవు కష్టపడుతున్నా ఒక స్థితికి చేరుకొన్నాక నీవు పడిన కష్టం అది ఇతరులకు కూడా ఉపయోగపడుతుంది. బుద్ధుడు కూర్చొన్న చెట్టుకు నైవేద్యం పెట్టటంకోసం సుజాత అనే అమ్మాయి పాయసం తెచ్చి నైవేద్యం చెట్టుకు పెట్టకుండా, ఆ పాయసం బుద్ధుడికి ఇస్తుంది. బుద్ధుడు ఆ పాయసం తాగాడు లేకపోతే అప్పుడు ఆ శరీరం నిలబడదు. అప్పుడు బుద్ధుడు దగ్గర ఉన్నవారు బుద్ధుడు పాడైపోయాడని, ఆయనను వదలి సారనాథ్ వెళ్ళిపోయారు. బుద్ధుడు ఆ చెట్టు

కిందనే నిర్వాణస్థితిని పొందాడు. ఆ చెట్టు కింద జ్ఞానం పొందాము కదా అని ఆ చెట్టువంక రెప్పకూడా వాల్చకుండా వారం రోజులు చూస్తూ ఉండిపోయాడు. తరువాతగాని ఆ చెట్టును విడిచిపెట్టి వెళ్లలేదు. ఆ కృతజ్ఞత చూడండి. తరువాత బుద్ధుడు తన దగ్గర నుండి పారిపోయిన వారి గురించి వెతుక్కుంటూ, వెతుక్కుంటూ సారనాథ్ వచ్చాడు. ఈయన పాడైపోయాడని అనుకొని ఈయనను విడిచి వెళ్లిపోయిన వారిని వెతుక్కుంటూ వచ్చి మొదటి టీచింగ్ వారికే చెప్పాడు. ఆయన కృతజ్ఞత చూడండి. ఆయన చెప్పేది నిర్మలంగా చెపుతాడు, నీవు వినకపోయినా ఆయన ఆరోగ్యాన్ని పాడుచేసుకోడు. దేవుడు ఉన్నాడా? లేడా? అని అడిగితే ఉన్నాడు అని చెప్పడు, లేడు అని చెప్పడు. మీరు దుఃఖంలో ఉంటే దేవుడు ఉన్నాడు అని చెప్పినా ప్రయోజనం ఏమిటి? ముందు మీరు దుఃఖంలో నుండి విడుదల పొందాలి. ఈ మధ్య ఒకరికి కేన్సర్ వచ్చింది. 6 నెలల కంటే బతకడు అని చెప్పారు. మీరు ఏమి చేసుకొంటున్నారు అని అడిగితే బాకీలు వసూలు చేసుకొంటున్నాను అని చెప్పాడు. నువ్వు నూటికి నూరుపాళ్ళు ఆనందంలో ఉంటే ఇతరుల గొడవలు అసలు రావు, నీకు సుఖం లేనప్పుడు దానిని కవర్ చేసుకోవటానికి ఇతరుల గొడవలు ఏవో వేసుకొని తిరగటం, నీకు ఆనందంగా ఉంటే ఏ గొడవ లేదు, నీవు ఆనందంగా లేకపోవటం వలన లోకం గొడవలు అన్నీ వస్తున్నాయి.

నాకు జ్ఞానం ఇమ్మని బుద్ధుడి కుమారుడు బుద్ధుడిని అడిగాడు. బుద్ధుడు 5 ని॥లు నిర్మలంగా ఉన్నాడు. తరువాత కుమారుడితో ఒక పళ్లెం నిండా నీరు పోసుకొని తెమ్మని చెప్పాడు. పళ్లెం తెచ్చాక బుద్ధుడు తన రెండు కాళ్ళు పళ్లెంలో పెట్టి, 2 ని॥ల తరువాత కాళ్ళు తీసేసాడు. ఆ నీటిలో నీకు నలకలు కనిపిస్తున్నాయా అని కుమారుడిని అడిగాడు, కనిపిస్తున్నాయి అని కుమారుడు చెప్పాడు. అటువంటి నలకలు నీ బుద్ధిలో ఉన్నాయి, అవిపోతే నీకు జ్ఞానం వస్తుంది అని చెప్పాడు. వాటిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చెయ్యి, అవి పోతాయి, అప్పుడు జ్ఞానం వస్తుంది అన్నాడు. జ్ఞానం అనేది బుద్ధుడితో ఆగిపోకూడదు, రాబోయే జ్ఞానులకు కూడా నమస్కారం అన్నాడు బుద్ధుడు. మీకు కావలసింది వెలుతురు, ఏ లైటు అయితేనేమి? మిమ్ములను ఉద్ధరించటానికి అవసరమైతే ఇంకో బుద్ధుడు వస్తాడు అని చెప్పాడు. నేను వస్తాను, నేను మరల అవతరిస్తాను ఇటువంటి మాటలు బుద్ధుడు చెప్పలేదు. ఇప్పుడు ఒక చెట్టు మనకు టీచ్ చేస్తోంది అనుకోండి, నేను ఏదో చెప్పేస్తున్నాను అని అది అనుకోదు, బుద్ధుడి టీచింగ్ కూడా అలాగే ఉంటుంది. వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అని అనుకొంటూ ఉంటే దాని అర్థం ఏమిటి అంటే నీకు సుఖం లేదు అని అర్థం. ఇప్పుడు సగం నిండి ఉన్నా శరీరం మరణించేటప్పటికి మన కప్ప సుఖంతో పూర్తిగా నిండిపోవాలి, అప్పుడు ఇంక పునర్జన్మ ఉండదు. మనకు పుట్టుక అంటే ఇష్టం, మరణం అంటే ఇష్టం ఉండదు. ఇష్టం అయినది కోరుకొన్నప్పుడు, ఇష్టం లేనిది కూడా వచ్చేస్తుంది. బుద్ధుడు శిష్యులలో ఒకడు చాలా

మంచివాడు ఉండేవాడు. ఎవరైనా వాడిని రమ్మని అడిగితే ఇప్పుడు రానండి, అవసరమయి నప్పుడు వస్తాను అని చెప్పేవాడు. అంటే ఇప్పుడు మీరు సుఖంగా ఉన్నారు కదా, మీకు ఎప్పుడైనా కష్టంగా ఉన్నప్పుడు వస్తాను అని అర్థం, అది మంచితనానికి పరాకాష్ట. మనం అయితే బాగున్నప్పుడు వారి కూడా తిరుగుతాము, వారికి ఏదైనా కష్టం వచ్చినప్పుడు వదిలేస్తాము.

మనం అవసరమైతే మాట్లాడాలి కాని వాదనకోసం ఎప్పుడూ మాట్లాడకూడదు. ఈ మధ్య ఒకచోట నేను ఎవరిగురించో చెపుతూ ఆయన చాలా ఎర్రగా ఉంటాడు అన్నాను, అవతలివ్యక్తి కాదనలేదు కాని ఎర్రటి తేలు అన్నాడు. అంటే శరీరం ఎర్రగానే ఉంది కాని మనస్సు తేలులాంటిది, ఎక్కడ దొరికితే అక్కడ కాటువేసేస్తాడు అని చెప్పటం. వీరందరూ మనకు గురువులే. పుస్తకాలు చదివి మనం నేర్చుకొనే పాఠాలకంటే ప్రకృతి మనకు ఎక్కువ పాఠాలు చెపుతుంది. నీవు ఇతరులను సుఖపెట్టాలనుకొన్నప్పుడు, ఇతరుల వలన నీవు సుఖపడాలనుకొన్నప్పుడు దయను ప్రాక్టీసు చెయ్యాలి. మనలోపల సూక్ష్మ శరీరం ఉంది, అది మన కళ్లకు కనబడదు. అది ఒంటరిగా ఉండదు. ఇంద్రియాలను జత వేసుకొని ఇష్టాలను, అయిష్టాలను తీర్చుకొంటూ, కోరికలు తీర్చుకొంటూ ఉంటుంది. ఒకరికి ఉపకారం చేస్తుంది, ఒకరికి అపకారం చేస్తుంది, ఒకరిని ముద్దు పెట్టుకొంటుంది, ఒకరిని మొట్టుతూ ఉంటుంది, ఇలా ఏదో ఒకటి చేస్తూ ఉంటుంది. దానికి ఎంతసేపు కోలాటం ఉండాలి, ఏవో గొడవలు వేసుకొని తిరుగుతూ ఉంటుంది, మీరు పాటలు బాగా పాడారు అంటే అది లోపల ఫుడ్ తీసుకొంటూ ఉంటుంది. మంచి పనులు చేయండి, పుణ్యం సంపాదించుకోండి, నా జోలికిమటుకు రాకండి అని చెపుతుంది, పుణ్యం వలన వచ్చే ఫలితాన్ని ఎంజాయ్ చేయటానికి మరల అది ఉండాలి కదా అందుకు అలా చెపుతుంది. నిప్పు సూక్ష్మశరీరాన్ని కాల్చలేదు, ఆత్మజ్ఞానం మాత్రమే దానిని కాల్చుతుంది. సూక్ష్మశరీరం పూర్తిగా కాలిపోయే వరకు పునర్జన్మలు ఆగవు. భగవంతుడు ఉన్నాడు అని అంటాము అనుకోండి, ఆయనను తెలుసుకొనే ప్రయత్నం చేయలేకపోతే భగవంతుడు ఉన్నాడని అంగీకరించినా దానివలన ప్రయోజనం లేదు. సర్వానికి కర్త ఈశ్వరుడు. సర్వ కర్తృత్వం, సర్వ భోక్తృత్వం ఆయనే అయినప్పుడు మనకు ఎందుకు దుఃఖం వస్తోంది? నేను చేస్తున్నాను అని అనుకోవటం వలన దుఃఖం వస్తోంది. నేను చేస్తున్నాను అని అనుకోవటానికి కారణం దేహబుద్ధి. జరిగేది భగవంతుడి నిర్ణయమే అయినా నేను చేస్తున్నాను అనుకోవటానికి దేహబుద్ధే కారణం. భగవాన్ ఒకమాట చెప్పారు దేహం తప్పలు చేయదు, దేహం నేను అనే తలంపు తప్పలు చేస్తుంది. తప్పలు చేసేది దేహము నేను అనే తలంపు, దెబ్బలు తినేది దేహం. దేహం నేను అనుకోవటంలోనే కర్తృత్వం వచ్చేస్తుంది.

దేహము నేను అనే తలంపులోనుండి బయటపడలేకపోతున్నాము. ఈ చిన్నగెడప దాటలేకపోతున్నాము. మనకు అన్నీ ఉన్నాయి అయినా మనం సుఖంగా ఉండలేకపోతున్నాము,

ఎందువలన? దానికి మనలో ఉన్న అజ్ఞానం కారణం. మనలో ఉన్న అజ్ఞానమే కోతి బావ. దానికి చపలత్వం ఉంటుంది. అసలే అది కోతి, మరల సారా తాగింది అనుకోండి చాలా దారుణంగా ఉంటుంది. ఇంక దానిని తేలు కుట్టింది అనుకోండి, అది ఎంత గొడవ చేస్తుందో చూడండి. మన మనస్సు కూడా అలాగే ఉంది, టీచింగ్‌కు ప్రాముఖ్యత ఇవ్వాలి. శ్రవణం చేయుటం వలన రోగం తగ్గకపోయినా, రోగాన్ని తెలుసుకోవచ్చు, మన మనస్సులో ఏమి ఉందో మనకు తెలుస్తుంది. మనం దేవుడిని ఎందుకు తెలుసుకోలేకపోతున్నాము అంటే ఆయనకు సెపరేట్‌గా ఉండాలి అనుకొంటున్నాము, మనకు వేరు కాపురం అంటే ఇష్టంగా ఉంది, అందుచేత ఆయన దూరం దూరంగా ఉంటున్నాడు. మనం ఏ మెతుక్కి, ఆ మెతుకుగా ఉండాలి అనుకొంటున్నాము కాని మెతుకులు అన్నీ కలిసి ముద్దగా ఉండటానికి ఇష్టపడటం లేదు, ముద్దగా అయిపోతే మనకు అస్థిత్వం ఉండదని భయం. కోరికలు నెరవేరినప్పడు ఆనందం వస్తోంది కదా మామూలుగా ఎందుకు రావటంలేదు. మనకు ఏదైనా కోరిక తీరితే అందులోనుండి ఆనందం వస్తుంది, అది తాత్కాలికం. ఒక కోరిక నెరవేరింది అనుకో అది అక్కడితో ఆగదు, ఒక వెయ్యి కోరికలను తీసుకొని వస్తుంది. ఇలా కోరికలు తీర్చుకొంటూ మోక్షం పొందినవాడు ఈ సృష్టిలో ఎవడూ లేడు. పూర్వం ఇలా కోరికలు నెరవేర్చుకొంటూ వెళ్ళారు, వారికి ముగింపు దొరకలేదు, ఇలా కోరికలు నెరవేర్చుకొనేకొలది దుఃఖం పెరుగుతోంది. నెరవేరిన కోరికలు అక్కడితో ఆగకుండా ఇంకా కోరికలను తీసుకొనివస్తాయి. ఇలా కోరికలను సంతృప్తిపరిచేకొలది దుఃఖం ప్రారంభమయింది. ఇవి చూసి చూసి విసుగెత్తి లోపలకు వెళ్ళటం మొదలుపెట్టారు. లోపలకు వెళ్ళటానికి కూడా దుఃఖం కారణం కదా. దుఃఖం లోపలకు తీసుకొని వెళుతుంది. అర్జునుడికి దుఃఖం రావటం వలన ఆయన యోగి అయ్యాడు, మనకు దుఃఖం వస్తే రోగులమవు తున్నాము. మీకు బాబా అంటే ఇష్టం అనుకోండి, మంచిదే, అయితే మా అందరి దగ్గర ఆనందంగా ఉండలేకపోతే మీలో ఏదో బలహీనత ఉంది అని గుర్తు, దానిని తొలగించు కోవాలి.

దేవుడు అంతటా ఉంటే కొన్ని స్థలాలలోనే వైబ్రేషన్స్ ఎక్కువగా ఎందుకు ఉన్నాయి? ఇప్పడు లైటు ఉంది అనుకో దాని కాంతి గది అంతా ఉంటుంది కాని లైటుకు దగ్గరగా మనం ఉంటే ఆ కాంతి ఎక్కువగా ఉంటుంది. పుణ్య క్షేత్రాలలో ఎంతోమంది పరమపవిత్రులు అక్కడ తపస్సులు చేసారు, జీవించారు. వారికి మనస్సు ఉన్నా మనస్సు లేనివారితో, ఇంద్రియాలు ఉన్నా ఇంద్రియాలు లేనివారితో సమానంగా ప్రకృతిని దాటి జీవించారు కాబట్టి అవి పుణ్యక్షేత్రాలు అయ్యాయి, వారి వైబ్రేషన్స్ అక్కడ పనిచేస్తాయి. శరీరానికి ఏదైనా రోగంవస్తే రోజూ బాధపడుతూ కూర్చోకూడదు, ఆ రోగాన్ని తొలగించుకొంటే చాలు. అలాగే మనస్సులో ఉన్న దోషాలను తొలగించుకోవాలి. ఎటాచ్‌మెంట్‌లోనుండే మనకు రోగాలు, దుఃఖాలు వస్తాయి. ప్రేమవేరు, బంధం వేరు. ప్రేమ నిన్ను బంధించదు, ఎటాచ్‌మెంట్ నిన్ను బంధిస్తుంది. మనకు ఉన్నది

ఎటాచ్‌మెంట్‌గాని ప్రేమకాదు. ప్రేమ మనకు కాంతిని ఇస్తుంది, ఎటాచ్‌మెంట్ మనలను చీకటిలోనికి తీసుకొనిపోతుంది. మనం అనుకొనేది ఏదీ నిజం కాదు. మనకు నిజం ఎలా ఉంటుందో తెలియదు. తెలియనివారము తెలియనట్లు ఉంటే పరవాలేదు కాని మనకు తెలిసినదే నిజం అనుకొని ప్రమాదంలో పడతాము. మనం కోరికను నెరవేర్చేకొలది అనేక కోరికలు వస్తూ ఉంటాయి, నెరవేర్చకపోతే ఏ గొడవ లేదు. నీవు ప్రపంచానికి ఉపయోగపడాలంటే, ఏదైనా చేయాలి అంటే ముందు నీ తలకాయలో ఉన్న ప్రపంచాన్ని విడిచిపెట్టాలి. అంటే నీవు క్రియేట్ చేసుకొన్న ప్రపంచాన్ని వదులుకోవాలి. ప్రతీ మనిషికి వాడి తలకాయలో ఏదో ఒక ప్రపంచం ఉంటుంది, ఒక్కో తలకాయకు ఒక్కో పిచ్చి. మనందరం ప్రపంచం అనే పిచ్చి ఆసుపత్రిలో ఉన్నాము. ఈ పిచ్చి ఉన్నంతకాలం పునర్జన్మలు వచ్చేస్తూ ఉంటాయి. ఎవడి ప్రపంచంలో వాడు ఉంటే ఇంక సమాజానికి ఏమి ఉపయోగపడగలము. నువ్వు ప్రపంచానికి నిజంగా ఉపయోగపడాలంటే నీ తలకాయలో ఉన్న ప్రపంచాన్ని ముందు విడిచి పెట్టు.

కోరికలు తీర్చుకోవటం వలన వచ్చేది సుఖం కాదు, ఆనందం కాదు, అది సంతోషం. సంతోషం వేరు, సుఖం వేరు. సంతోషం అలా ఉన్నా పరవాలేదు, అది వెళ్ళి దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. మనం ఇలా ప్లెజర్, పెయిన్‌లలో తిరుగుతూ ఉంటాము, ఏదోరోజు శరీరానికి చావు వచ్చేస్తుంది. నీవు కోరికను నెరవేర్చకుండా, దానిని కంట్రోలు చేస్తే అప్పడు నీకు సంతోషం రాదు, ఆనందం వస్తుంది. ఇప్పడు మనం అందరం ఎక్కడో ఒకచోట పుట్టేసాము, అందువలన చుట్టాలను సెలెక్టు చేసుకోవటం కుదరదు. మనం స్నేహితులను, పుస్తకాలను జాగ్రత్తగా సెలెక్టు చేసుకోవాలి. ఆనందం వేరు, సంతోషం వేరు. ఆనందం ఇప్పడు రావాలంటే రాదు, నీ బుద్ధి శుద్ధి అయ్యాక నీకు ఆనందం అందుతుంది. అంతవరకు సంతోషాన్నే ఆనందం అనుకొంటాము, అది ప్రమాదం. అసలు డిస్ట్రబెన్స్ అంతా మనస్సులోనే ఉంది. మనస్సును అతిక్రమిస్తే మన ద్వారా ప్రపంచానికి మేలు జరుగుతుంది, మనం చేయాలి అని కర్తృత్వం పెట్టుకోనక్కరలేదు. నువ్వు లైట్ అయ్యావు అనుకో నీ ద్వారా అనేక దీపాలు వెలిగించుకోవచ్చు. అక్కడ ఉన్న దీపాన్ని బట్టి మిగిలిన దీపాలను వెలిగించుకోవాలి కాని ఉన్న దీపాన్ని ఆర్పివేయకూడదు. ఎంజాయ్‌మెంట్ వేరు, పెర్ఫెక్షన్ వేరు. మనం ఎంజాయ్ మెంట్ రోడ్డులో ప్రయాణం చేస్తున్నాము, కాని ఆశించేది పెర్‌ఫెక్షన్‌ను ఆశిస్తున్నాము. ఈ రెండింటికి పొంతన కుదరదు. మీరు వివేకాన్ని పెంచుకోండి, మీ యొక్క చైతన్యస్థాయిని పెంచుకోండి. మనం హైద్రాబాద్‌లో ఉన్నప్పడు ఒకలాగ, వైజాగ్‌లో ఉన్నప్పడు ఒకలాగ, అరుణాచలంలో ఉన్నప్పడు ఒకలాగ ఉంటే మన మనస్సులో ఏదో డిస్ట్రబెన్స్ ఉంది అని అర్థం. నువ్వు సమాజంలో ఒకరిని ప్రేమించి, మరొకరిని ప్రేమించలేకపోతే నీ మనస్సులో ఏదో బలహీనత ఉంది, దానిని తెలుసుకొని, దానిని తొలగించుకోవాలి. ప్రేమ వేరు, బంధం వేరు. మనం బంధాన్ని ప్రేమ అనుకొని చీకటిలో

కూరుకొనిపోతున్నాము. మనకు సత్యం తెలియటం లేదు అని అనుకోవాలి కాని సత్యంకానిదానిని సత్యం అనుకొంటే డేంజర్‌జోన్‌లోనికి వెళ్ళిపోతాము, మనరోగం ముదిరిపోతుంది, టేబ్లెట్‌లకు తగ్గిపోయేది సర్జరీ చేయవలసి వస్తుంది.

మనకు భయం ఎందుకు వస్తోంది? భయం వస్తూ ఉంటే నష్టం ఏమిటి? భయం వలన దుఃఖం వస్తుంది. మనం ఉన్నాము అని అనుకోవటం వలన మనకు భయం వస్తోంది. మనం లేము అన్నసంగతి తెలిస్తే భయంపోతుంది. నిజంగా మనం లేము కాని ఉన్నాము అని అనుకోవటం వలన ఇన్ని గొడవలు వస్తున్నాయి. ఇవి అన్నీ నిజంగా రావటం లేదు, అనుకోవటం వల్ల వస్తున్నాయి. ఆ క్లూ నీవు పట్టుకోవాలి. అది పట్టుకొంటే నీద్వారా కాంతి, శాంతి ప్రవహిస్తుంది. దీపం చీకటినివ్వదు, వెలుతురునిస్తుంది. చీకటి గురించి బోధించటం ఎందుకు? చనిపోవటం గురించి బోధించటం ఎందుకు? వెలుతురు గురించి బోధించాలి, జీవితం గురించి బోధించాలి. జననమరణచక్రంలో నుండి మనం జాగ్రత్తగా విడుదలపొందాలి. కంగారు పడకూడదు, కంగారుపడితే మనకే నష్టం, ఉన్నది పోతుంది, అందుచేత నెమ్మదిగా ఈ చక్రంలో నుండి బయట పడాలి, ఇప్పుడు మనం బయట వెతుక్కొనేది లోపల వెతుక్కొంటే మనకు జ్ఞానం వచ్చేస్తుంది. కుండలోపల అన్నం ఉంది అనుకోండి, పైన మూత ఉంటే లోపల అన్నం ఉన్నా మనకు కనబడదు. అలాగే మన హృదయంలో ఆనందం ఉంది. మనకు తెలిసినా, తెలియకపోయినా ఆనందం మన హృదయంలో ఉంది. మనం ఉన్నాము అని అనుకోవటం వలన అది మనకు తెలియటం లేదు, మనం లేము అన్న సంగతి మనకు తెలిస్తే ఆనందం మనకు అందుతుంది, అంటే ఆ మూతను తీసి ఒక ప్రక్కన పెట్టాలి. మనకు అశాంతి ఉంది అనుకో, ఆ సమస్యను పరిష్కారం చేసుకోకుండా స్వర్గానికి వెళ్ళిపోదాము అంటే ప్రయోజనం ఏముంది. లోపల ఉన్న శాంతి మీకు దొరికింది అనుకోండి, అప్పుడు ఇంద్రుడు కనబడి స్వర్గానికి తీసుకొనివెళ్తాను అన్నా వద్దు అని చెపుతారు. మీకు బంగారం గురించి తెలుసు అనుకోండి. ఎవరైనా పెంకుముక్క తెచ్చి ఇచ్చి బంగారం మంచిది కాదు, ఇదే మంచిది అని చెప్పినా దానిని మీరు తీసుకోరు ఎందుచేత బంగారం గురించి మీకు తెలుసుకాబట్టి, అదే తెలియకపోతే తీసేసుకుంటాము. చిన్నపిల్లలు అలాగే చేస్తారు, మన చేష్టలు చిన్న పిల్లల చేష్టలులాగవున్నాయి.

ఏదో చేయటం వలన పుణ్యం రావచ్చుగాని జ్ఞానంరాదు. పుణ్యం వలన స్వర్గానికి వెళతారు, అక్కడ కొంతకాలం ఉన్నాక వెళ్ళి రమ్మంటారు. ఇప్పుడు మీరు సినిమాకు వెళ్ళారు అనుకోండి అది చాలా బాగుంది అనుకోండి అయినా అక్కడ ఉండనివ్వరు, రెండు గంటలు సినిమా అయిన తరువాత వెళ్ళి రమ్మంటారు. స్వర్గలోకం అయినా అంతే, అక్కడకు వెళ్ళటానికి వళ్లంతా బాడి చేసేసుకొంటున్నారు. మీకు ఇంటి దగ్గర టెన్షన్ ఉంది అనుకోండి. అది తగ్గించుకోవటానికి సినిమాకు వెళతారు. ఆ సినిమాలో రెండు గంటలు ఉంటారు, మరల

ఇంటికి రాగానే టెన్షన్ వచ్చేస్తుంది. ఏదో తాత్కాలికంగా కొద్ది టైము తగ్గటం కాదు కదా, పెర్మనెంట్ క్యూర్ చూసుకోవాలి కదా అంటే అది పూర్తిగా తగ్గేవిధానం చూసుకోవాలి, టెన్షన్ తగ్గటానికి కొంతమంది సారా తాగుతారు. దాని వలన ఇల్లు గుల్లవుతుంది, వల్లు గుల్లవుతుంది. అసలు ఈ టెన్షన్ ఎందుకు వస్తోంది? దానికి కారణం ఏమిటి అని చూసుకోవాలి. నీకు టెన్షన్ రానియ్యి, తొంభై గొడవలు రానియ్యి, నువ్వు ఉండటం వలన ఇవి అన్నీ వస్తున్నాయి. ఆ ఉండేది ఎవరో చూడు, అది తెలిస్తే ఏమీ లేదు. ఇక్కడ ఆగటం మానేసి రోడ్డు మీద ఉన్న దుమ్ము అంతా నొల్లుకొస్తున్నావు. అసలు సమస్యను వదిలేసి ఎక్కడో గుళ్ళు కట్టిస్తాను అంటావు, కట్టిస్తేకట్టించవచ్చుగాని అసలు నీసమస్య ఏమిటి? దానిని పరిష్కారం చేసుకోవటానికిచూసుకో.

మీరు పాటలు బాగా పాడుతున్నారు అంటే మీకు సంతోషం వస్తుంది, పొంగు వస్తుంది. ఆ పొంగేది ఎవరు? అది చూసుకోండి. ఈ మాటలు అనకముందు నీవు ఎలాగ ఉన్నావో ఈ మాటలు విన్న తరువాత కూడా నీవు అలాగే ఉండగలిగితే అంటే నీవు ఒకేలాగ ఉంటే నీవు సత్యాన్ని రిసీవ్ చేసుకోవటానికి ఫిట్ అవుతున్నావు. ఒకవేళ నీవు పొంగుతూ ఉంటే సత్యాన్ని రిసీవ్ చేసుకోవటానికి నీవు ఫిట్ అవ్వలేదని అర్థం, నీకు ఒకవేళ సుఖస్థానం దొరికింది అనుకో, నీ శరీరం మరణించినా ఆ సుఖం బ్రేక్ అవ్వదు, సుఖం అలా కంటిన్యూ అయిపోతుంది. మరల నీకు దేహం వచ్చినా సుఖం అలా కంటిన్యూ అవుతుంది. త్యాగి కానివాడు జ్ఞాని కాలేడు, జ్ఞాని కానివాడు సుఖి కాలేడు, సుఖి కానివాడికి జన్మ ఆగదు, పునర్జన్మ వచ్చేస్తుంది. మనకు ఇష్టంలేని వస్తువును విడిచిపెట్టటం త్యాగంకాదు, మనం ఆముదం విడిచిపెట్టేసాము అనుకోండి అది త్యాగం కాదు. త్యాగం అంటే మన మనస్సుకు బాగా ఇష్టమైనది, జ్ఞానం పొందటానికి అడ్డువచ్చేది విడిచిపెట్టటం త్యాగం. శ్రద్ధలేని శ్రార్థాలు ఎందుకు అని అంటారు. మనం చేసేపనిలో శ్రద్ధ ఉండాలి కదా. ఇంట్లో వారు ఏమనుకొంటారు, ఇతరులు ఏమనుకొంటారు అని తద్దినాలు పెట్టటం ఎందుకు? ఎప్పడూ కూడా మనకు పనికిరాని వస్తువులను ఇతరులకు ఇవ్వకూడదు. అలా ఇవ్వటం వలన వచ్చే జన్మలో అందరూ పనికిరాని వస్తువులు మనకు ఇచ్చేటట్లు ఈశ్వరుడు చేస్తాడు. మనం ఏవైతే ఇతరులకు ఇచ్చామో అవే భగవంతుడు మరల మనకు ఇస్తాడు. ఆ పనికి రాని వస్తువులు అన్నీ తిరిగి మనకే వచ్చేస్తాయి అని మనకు తెలియుటం లేదు. మనం ఏవైతే ఇతరులకు ఇచ్చామో వాటినే మనచేత తినిపిస్తాడు. అందువలన బహుజాగ్రత్తగా ఉండండి. మనం ఏదైతే ఆక్షేపించామో అదే మనకు తిరిగి వస్తుంది. ఎవడైనా కుంటోడు ఉన్నాడు అనుకోండి, వాడిని కుంటోడా అని పిలువకూడదు, ఎప్పడూ పేరు పెట్టి పిలవాలి. వాడిని కుంటోడా అని పిలిస్తే ఆ కుంటితనం మరల మీకు వచ్చేస్తుంది. కొంతమంది ఒంటరిగా ఉన్నప్పడు బాగా తినేస్తారు, పదిమందిలో ఉన్నప్పడు వద్దు వద్దు అంటారు, పక్కన ఉన్నవాడిని కూడా చెడగొడతారు. ఇది అంతా మన బుర్రలో

ఉన్న దోషం, దానిని సరిచేసుకోకుండా ఏదో చెట్టు చుట్టూ తిరిగి వచ్చేసాము అంటే అర్థం ఏమిటి? నిన్ను నీవు బాగుచేసుకోవటానికి ప్రయత్నం చేసుకో. దైవసహాయం వస్తే తీసుకో, రాదు అనుకో ఎదురుచూడవద్దు, నీ ప్రయత్నం నీవు చెయ్యి. ఇవన్నీ భగవంతుడు చెప్పాడు. వినటానికి టైము లేదు మేము బిజీగా ఉన్నాము అంటే ఏమిటి? పనీపాటులేనివాడు బిజీ బిజీ అంటాడు. కష్టపడి పనిచేసుకొనే వాడికి కొంత విశ్రాంతి ఉంటుంది, దేవుని మాటలు వింటాడు. శరీరానికి మరణం వచ్చింది అనుకోండి, అప్పుడు మేము బిజీగా ఉన్నాము అన్నా కుదరదు.

మీ పని మీరు శ్రద్ధగా చేసుకోండి. ఫలితం రావచ్చు, రాకపోవచ్చు, ఫలితం కోసం ఎదురు చూడవద్దు. ఫలితం వస్తే మరల అది నా వలననే అయిపోయింది అనుకోవద్దు. ఫలితం నీ చేతిలో లేదు అని పనిమీద విరక్తి పెట్టుకోవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. మనం దారిన పోయేవాడు చెప్పిన మాటలు నమ్ముతాము కాని భగవంతుడు చెప్పిన మాటలు నమ్మము, దానికి మన బుద్ధిలో ఉన్న దోషం కారణం. పూర్వపుణ్యం లేకపోతే భగవంతుడు చెప్పిన మాటలను కూడా మన బుద్ధి విననివ్వదు. పూర్వజన్మలో సత్కర్మ చేయటం వలన మనకు ఈ దేహం వచ్చింది, సత్కర్మలు అనే డబ్బుతో మనం ఈ దేహాన్ని కొనుక్కొన్నాము. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సరిగా ఉపయోగించుకోకపోతే వెనుక జన్మలకు పంపించేస్తాడు. ఇప్పుడు మనకు భయం వేస్తోంది అనుకోండి, ఒకోసారి ఈ సమస్యను పరిష్కారం చేసుకోలేక మనస్సును డైవర్టు చేస్తాము, అది అయిపోయాక మరల మనకు భయం వచ్చేస్తుంది. అసలు దానికి కారణం ఏమిటి అని జాగ్రత్తగా చూసుకొని ఆ కారణాన్ని కట్ చేయాలి. ప్రపంచం అశాంతిగా ఉంది అంటారు ఏమీలేదు మనలో ఉన్న అశాంతే ప్రపంచంలో కనిపిస్తోంది. మనం శాంతిని డబ్బుతో కొనుక్కోలేము. నీకు చాలా డబ్బు ఉంది అనుకో స్థలాలు కొనుక్కోవచ్చు, విదేశాలకు వెళ్ళి కూడా టోక్యోలాంటి పెద్ద నగరాలలో కూడా స్థలాలు కొనుక్కోవచ్చుకాని నీ దగ్గర లక్ష కోట్లు డబ్బు ఉన్నా కూడా ఆ డబ్బుతో నీవు శాంతిని కొనుక్కోలేవు, శాంతికి విలువ కట్టలేము, డబ్బు ఉంది కదా అని నీవు వంద గుడులు కట్టినా నీకు శాంతి రాదు, అది వెలలేనిది, వెలలేని దానిని వెలపెట్టి ఎలా కొనుక్కోగలవు.

మనం టీ తాగుతున్నాము అనుకోండి ఒక మాదిరి వేడిని మన నాలుక తట్టుకొంటుంది, దానికి మించిన వేడిని నాలుక తట్టుకోలేదు. కొంతమంది ఎంతగ్రేట్‌గా ఉంటారు అంటే నరకంలో ఉన్న సఫరింగ్ అంతా వారికి వచ్చినా తట్టుకొంటారు. నరకంలో ఉన్న సఫరింగ్ ఓడిపోయి వెనక్కి వెళ్ళిపోతుంది. అందుచేత అటువంటి వారిని నరకానికి పంపరు, వారిని పంపితే నరకం మారిపోతుంది. తలకాయ లేనివాడికి తలపోటు రాదు, లోపల సఫర్ అయ్యేవాడు లేకపోతే ఇంక సఫరింగ్ ఉండదు. మీకు వెయ్యి పనులు ఉంటే వెయ్యి పనులు కూడా ప్రక్కకు పెట్టి మీరు టైముకు భోజనం చెయ్యండి. భోజనం చేసిన తరువాత మీరు ఆ పనులు చేసుకోండి

అని ఆయుర్వేద గ్రంథంలో ఒక మాట ఉంది. మనస్సుకు వేరుగా ఏమీ లేదు, దానిని తొలగించుకొంటే సరిపోతుంది. మనకు చిరాకువచ్చినా, దుఃఖం వచ్చినా, సంతోషం వచ్చినా మనస్సుకు వేరుగా రావు, మనస్సు లేకపోతే వాటికి అస్థిత్వం లేదు. ఈ గోడకు భయం వేస్తుందా? దానికి భయంలేదు అలాగని గోడ లేదా అంటే ఉంది ఎందుచేత నంటే అక్కడ ప్రాణం లేదు, మనస్సు లేదు. మనకు మనస్సు ఉంది, ప్రాణం ఉంది, శరీరం ఉంది కదా, కాని అవి మనం కాదు అని ఉపనిషత్ చెబుతోంది. మాధుర్యం మన హృదయంలోనే ఉంది, బయట ఎక్కడా మాధుర్యం లేదు. మన హృదయంలో ఉన్న మాధుర్యం కళ్లకు కనబడదు, చెవులకు వినబడదు లేదా అంటే ఉంది. ఒక వస్తువు నన్ను సుఖపెడుతోంది అనుకో, అది నిజమైతే అందరినీ సుఖపెట్టాలి కదా. నీ ఇష్టాన్ని బట్టి అలా ఉంది, నీ ఇష్టాన్ని తీసి ఒక ప్రక్కన పెడితే అందులో ఏమీలేదు. మన ఇష్టం వలన వస్తువు గొప్పగా ఉన్నట్లు అనిపిస్తుంది, ఇష్టాన్ని ప్రక్కన పెడితే గొప్పతనం లేదు. బయట సృష్టిలో ఎక్కడా మాధుర్యం లేదు, బయట ఉన్నది అంతా వట్టి గడ్డే, దాని మీద ఇష్టం వలన, ఎటాచ్‌మెంట్‌వలన ఎంత గొప్పగా ఉందో అనిపిస్తుంది. ఒకవేళ స్వర్గంలో మాధుర్యం ఉన్నా అది నీలో ఉన్న మాధుర్యానికి సరిపోదు. మీరు యం.ఎల్.ఏ., పదవి చేయాలి అనుకొంటున్నారు అనుకోండి, యం.ఎల్.ఏ., పదవి గొప్పగా ఉంది అనిపిస్తుంది, నీ ఇష్టాన్ని బట్టి అలా అనిపిస్తుంది. బయట ఏవైనా మధురక్షణాలు ఉన్నట్లు అనిపించినా అవి తుంపరలు మాత్రమే, వాటర్ నీవే. మనమే మాధుర్యం అయినప్పుడు ఇంక క్షణాల గొడవ ఎందుకు. ఆ క్షణాలకు మన హృదయంలో ఉన్న మాధుర్యం ఇచ్చి బాగున్నాయి అనుకొంటున్నాము.

చైతన్యం ఉంటుంది దానికి ప్రాణం లేదు, మనస్సు లేదు అలాగని అది లేదా అంటే ఉంది. చైతన్యం లేకుండా ప్రాణం, మనస్సు ఉండలేవు. మనస్సు, ప్రాణం లేకుండా చైతన్యం ఉంటుంది. బుద్ధుడి చర్మం టెండర్‌గా ఉంటుంది, స్మూత్‌గా ఉంటుంది, మొఖం లవ్‌లీగా ఉంటుంది, ఆయన బ్లడ్‌లో భయంలేదు. మన నీడను చూసి మనకు భయం కలుగుతుంది. మనకు ప్రయాణం సరదాగా ఉంది అనుకో, గమ్యానికి చేరిన తరువాత ఇంత తొందరగా వచ్చేసామా అనిపిస్తుంది. మనం యూనివర్శల్ అయిపోతే ప్లేస్ మారినా ఏమీ అనిపించదు. మనం హైదరాబాద్‌లో ఉన్నా, అమెరికాలో ఉన్నా ఏమీ అనిపించదు. మనకు జ్ఞానం రానప్పుడు మన శరీరం ఎక్కడ ఉంటే మనం అక్కడ ఉన్నాము అనిపిస్తుంది, జ్ఞానం వచ్చాక మనం అంతటా ఉన్నాము అని తెలుస్తుంది. పిల్లలు ఏడ్చినప్పుడు లక్కపిడతలు, బొమ్మలు ఇస్తే ఏడుపు ఆపేసి వాటితో ఆడుకొంటారు. అలాగే మనం ఆడుకోవటానికి నామ, రూపాలు పాడేసాడు దేవుడు. కొంతసేపు ఆడుకొన్నాక పిల్లవాడికి అమ్మ జ్ఞాపకం వచ్చినప్పుడు బొమ్మలు అన్నీ పడేసి అమ్మ దగ్గరికి చేరతాడు. అలాగే మనకి దేవుడు జ్ఞాపకం వచ్చినప్పుడు ఇవి అన్నీ వదిలేస్తాము అంతవరకు ప్రతీజన్మలోనూ ఈ నామరూపాలతో ఆడుకొంటాము. ఒకచేతితో పని చేసుకోండి,

ఇంకో చేతితో దేవుడిని పట్టుకోండి. పనిని మీ అంతట మీరు విడిచిపెట్టవద్దు, పనిని విడిచిపెట్టే ముహూర్తం ఆయన పెట్టుకొంటాడు, అంతేగాని కోపం వచ్చి పనిమాని వేయకూడదు. చదువు పూర్తి అయిన తరువాత శిష్యులు వెళ్ళేటప్పుడు గురువుగారు ఏమి చెపుతున్నారు అంటే, లోకం ప్రమాదం మీరు జాగ్రత్తగా ఉండండి. నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నానో లోకం అలా చూడదు జాగ్రత్తగా ఉండండి. అసహనం పనికిరాదు, అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు, అగౌరవం పనికిరాదు, అవినయం పనికిరాదు అని చెప్పాడు. మీ చేతికి ఉన్న వాచ్ ఎవడైనా పట్టుకొని పోయాడు అనుకోండి, వాడిది ఎంత తప్పో మీది కూడా అంతే తప్పు, మీ అజాగ్రత్తవలన పట్టుకొని పోయాడు అందువలన అజాగ్రత్త పనికిరాదు. సృష్టిలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. కొన్ని నీకు ఇష్టం ఉండవచ్చు, కొన్ని నీకు ఇష్టం లేని సంఘటనలు జరుగుతాయి, అలాగని మీ సహనం పోగొట్టుకోవద్దు, అసహనం పనికిరాదు. చదువుతో పాటు ఇవి అన్నీ చెప్పి పంపాడు, వాడు గురువు. సోక్రటీసును విషం పెట్టి చంపారు. ముందురోజు జైలునుండి పారిపోదామని ఆయనతో ఉన్నవారు సోక్రటీసుతో చెపుతారు, ఆయన ఏమి చెప్పాడు అంటే "యు టు లివ్, ఐ టు డై" అన్నాడు అంటే మీరందరూ బతికి ఉండండి, నేను చనిపోతాను, అది ఈశ్వర నిర్ణయం. సోక్రటీసును చూడటానికి చాలామంది వచ్చేవారు. మిమ్మల్ని చూడటానికి ఇంతమంది వస్తున్నారు, మమ్మల్ని చూడటానికి ఎవరూ రావటం లేదు అని సోక్రటీసును అడిగితే నాకు ఏమీ తెలియదు అన్న సంగతి నాకు తెలుసు అందుకే అందరూ చూడటానికి వస్తున్నారు అన్నాడు. మాకు అన్నీ తెలుసును అని మీరు అనుకొంటున్నారు ఇంకెవరు చూడటానికి వస్తారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 04-09-05, యానాం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మీకు అందరికీ జ్ఞానం కలుగుతుంది, సుఖం తెలుస్తుంది. సబ్జక్టు మాత్రం బాగా అర్థం చేసుకోండి. ఎప్పుడైనా మిమ్మల్ని సొంతబుద్ధి సుఖపెడుతుంది కానీ పరాయిబుద్ధి మిమ్మల్ని సుఖపెట్టదు. మీరు వివేకం పెంచుకోవాలి, పరిస్థితులను అర్థం చేసుకోవాలి. మనం ఎంతో కొంత వివేకంతోటి, పుణ్యబలంతోటి ఈ ప్రపంచంలోనికి వచ్చాము. మనం పూర్వజన్మలలో పుణ్యకర్మలు చేయటం వలన ఆధనం పెట్టి మనం ఈశరీరాన్ని కొనుక్కొన్నాము. మనకు ఈ మానవదేహం రావటం, ఆత్మజ్ఞానం సముపార్జించాలనే కాంక్ష రావటం, బుద్ధిసూక్ష్మత రావటం ఇవన్నీ పూర్వజన్మలలో మనం చేసినటువంటి సత్కర్మల ఫలితం, వాటితో ఇది కొనుక్కొంటే వచ్చింది కాని వూరికే రాలేదు. మనలోపల అంతర్యామిగా పరమాత్మ ఉన్నాడు, ఆయనను కాదని మనం చేసేది ఏమీలేదు. మనకు స్థూలశరీరం, సూక్ష్మశరీరం ఉన్నాయి. స్థూలశరీరం స్మశానంలో కాలిపోతుంది, సూక్ష్మశరీరం మనకూడా వస్తుంది. స్థూలశరీరం మరణించేలోపు సూక్ష్మశరీరాన్ని ఎంతవరకు బాగుచేసుకోగలిగితే అంతవరకు

బాగుచేసుకొని బయటకు వెళ్ళాలి. సూక్ష్మశరీరాన్ని పవిత్రం చేసుకోవటానికే ఈ సత్సంగాలు, ఈ ప్రవచనాలు. మన అహంకారం చెప్పినట్లు మనం నడుచుకుంటాము కాని శాస్త్రం చెప్పినట్లుగా మనం నడుచుకోము. ఈపని చెయ్యి అని భగవంతుడు చెపితే ఆ పని మనం చేయాలి, ఈ పని వద్దు అంటే అది మానివేయాలి. భగవద్గీతలో భగవంతుడు చెప్పినట్లుగా మనం నడుచుకొంటే మనకు పవిత్రత, ఏకాగ్రత, వినయం వస్తుంది. సూక్ష్మ శరీరం బాగుపడుతుంది, మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఎక్కడయితే వినయం ఉందో వాడు గుణవంతుడు అవుతాడు, వాడు భగవంతుని యొక్క దయకు పాత్రుడవుతాడు. మనం సూక్ష్మశరీరానికి ట్రైనింగ్ ఇవ్వాలి, దానికే సత్పురుషుల సహవాసం. మనకూడా సంపదలు రాకపోయినా సూక్ష్మశరీరం మనకూడా వస్తుంది. ఈ సూక్ష్మశరీరాన్ని బాగుచేసు కోవటానికి ఎంతవరకు ప్రాముఖ్యత ఇవ్వాలో అంతవరకు మనం ప్రాముఖ్యత ఇవ్వటం లేదు, పైగా ఎంతోధనం పెట్టి కొనుక్కొన్న శరీరం ఇది, దీనిని వృధాచేసుకొంటున్నాము. మన శరీరాన్ని, మనస్సును సద్వినియోగం చేసుకొని ఆత్మజ్ఞానం సంపాదించుకోవాలి. సహృదయం లేనివాడికి, వివేకం లేనివాడికి, వైరాగ్యం లేనివాడికి, సద్బుద్ధి లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మజ్ఞానం ఉన్నవాడు అందరికీ ఆనందాన్ని పంచిపెడతాడు, శాంతిని పంచిపెడతాడు. ఎవరైతే భగవంతుడిని స్మరించుకొంటున్నారో వారందరికి భగవంతుడు ఆనందాన్ని పంచిపెడతాడు.

దేహప్రారబ్ధాన్ని బట్టి మన జీవితంలో అనేక సంఘటనలు జరుగుతాయి. ఇప్పుడు మనం పాలకొల్లులో బయలుదేరి యానాం వచ్చాము. దారిలో అనేకం ఎదురువస్తాయి, ఎవరితోనైనా మాట్లాడతాము, ఒక గంట ఆగుతాము కాని మన దృష్టి మాత్రం యానాం మీదే ఉంటుంది అలాగే మనం తపస్సు చేసినా, సజ్జనసాంగత్యం చేసినా, పెద్దలకు సేవ చేసినా, మనకు మంచిసంఘటనలు ఎదురైనా, చెడుసంఘటనలు ఎదరైనా, మనకు ఇష్టంలేని సంఘటనలు జరుగుతున్నా మనం ఈ భూమి మీదకు వచ్చినది మొదలు మన లక్ష్యం మోక్షం మీదే ఉండాలి. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. మన దేహప్రారబ్ధాన్ని బట్టి బంధువులు, స్నేహితులు, విరోధులు వస్తారు, వీరందరూ స్వప్న సమానమే. మనకు అనేక తలంపులు, ఆలోచనలు వస్తాయి, వాటిని పట్టించుకోకూడదు. మన గమ్యం మోక్షం. మోక్షం పొందటానికి తగిన తలంపులు, ఆలోచనలు వస్తే వాటిని ఉపయోగించుకోవాలి, మోక్షం పొందటానికి అనుకూలంలేని తలంపులు, సంకల్పాలు వస్తే వాటిని తీసి ఒక ప్రక్కనపెట్టాలి, వాటితో పేచీలు పెట్టుకోవద్దు, వాటితో తాదాత్మ్యం పొందవద్దు. దేహప్రారబ్ధం చెడ్డగా ఉన్నా దానితో కనుక తాదాత్మ్యం లేకపోతే ప్రారబ్ధం కూడా ఏమీ చేయలేదు, మీకు దుఃఖం కూడా రాదు, జ్ఞాని యొక్క వైభవం అటువంటిది. భగవంతుడు మనలోపల ఉన్నాడు, బయట ఉన్నాడు, అంతటా వ్యాపించి ఉన్నాడు. మన స్థూలబుద్ధి వలన మనం ఆయనను దర్శించలేక

పోతున్నాము, అంతటా ఉన్న ఈశ్వరుడిని జ్ఞాని దర్శిస్తూ ఉంటాడు. మీ దేహప్రారబ్దం అనుకూలంగా ఉంది అనుకోండి, మీరు పొంగిపోవద్దు, సమానబుద్ధిని కాపాడుకోండి, అలా ఉంటే భగవంతుని దయకు మీరు పాత్రులవుతారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా గర్వం తెచ్చుకోవద్దు. ఈ అనుకూలపరిస్థితులు అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి కాని గర్వం మీ సూక్ష్మశరీరాన్ని పట్టుకొని మీకూడా వచ్చేస్తుంది. మనం చేసే పని నిర్మలంగా, నిశ్చలంగా, నిరాడంబరంగా చేయాలి. భగవంతుడికి ఒక ఆకారం లేదు, పేరు లేదు కాని మనలను గైడ్ చేయటానికి, మనకు బోధించటానికి ఒకరూపం ధరించి, ఒక పేరుపెట్టుకొని వస్తాడు. ఫలానా దేహం నాది, ఫలానా పేరు నాది అని అనుకోవటం మానివేస్తే ఈ శరీరం భూమిమీద ఉండగానే ఇప్పడే ఇక్కడే హద్దులులేని సుఖాన్ని, శాంతిని అనుభవించవచ్చు.

ఉన్నవాడు భగవంతుడు ఒక్కడే. నేను అది సాధించాను, నేను ఇది సాధించాను అంటాము. మనం ఏమీ సాధించలేదు. ఈ ఉపాధి మనం అనుకోవటం వలన నేను సాధించాను అనుకొంటాము. తనువు తాను కాదని తెలిసినవాడు ఏది చేసినా భగవంతుడు తన ద్వారా చేసుకొంటున్నాడు అనుకొంటాడు కాని నేను సాధించాను అని అనుకోడు. మనం పనిచేసేటప్పడు ఆ పనిచేయటం వలన మనం భగవంతుని దయకు ఎంతవరకు పాత్రులవుతామో చూసుకోవాలి, మన అంతర్యామి మనలను అనుగ్రహించకపోతే మనం ఎంతసాధన చేసినా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. మనం ఇతరులతో పోల్చుకోకూడదు, మన పద్ధతిలో మనం జీవించాలి. మనం ఇతరులకంటే ఎక్కువ అని, తక్కువ అని అటువంటి భావనలలోనికి వెళ్లవద్దు. భగవంతుడు మనకు ధనం, విద్య, అధికారం ఇలా కొన్ని అవకాశాలు ఇవ్వవచ్చు, ఇవన్నీ మనవికాదు, భగవంతుడు ఇచ్చినవే అని వాటిని ఎంతోకొంత సమాజానికి ఉపయోగిస్తూ ఉంటే దానివలన మనం ఈశ్వరునిదయకు పాత్రులవుతాము. అందుచేత ఈ ప్రపంచాన్ని ట్రైనింగ్ గ్రౌండ్‌గా తీసుకొని మంచి పనితోటి భగవంతుడిని ఆరాధించి ఈ శరీరం మరణించకముందే సూక్ష్మశరీరాన్ని బాగుచేసుకొని మనం బయటకు వెళ్ళాలి, ఎవరైనా నిన్ను విరోధిగా అనుకోవచ్చుకాని నీకు విరోధం వద్దు. మన ఇష్టాలు, అయిష్టాలు సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలి, మనకు చేతనైతే మంచి చేయాలి లేకపోతే ఊరక ఉండాలి. మనం మాట్లాడేమాట మనకు అశాంతిని, దుఃఖాన్ని తీసుకొని రాకూడదు, ఇది గుర్తు పెట్టుకోండి. భాషను కూడా గౌరవించాలి. మనం సహృదయంతో మాట్లాడాలి, మాట్లాడే భాష శుద్ధిగా ఉండాలి. మన శరీరాన్ని నియమించుకోవాలి, మాటను నియమించుకోవాలి, మనస్సును నియమించుకోవాలి, అదే తపస్సు. ఎవడైతే తన మనస్సును నియమించుకొంటున్నాడో వాడికి లోచూపు కలుగుతుంది. మనస్సు బాహ్యముఖానికి వెళితే అశాంతి, మనస్సు లోపలకు వెళితే విశ్రాంతి. భగవంతుడు చెప్పినమాట మనకు ప్రమాణం కాని లోకుల మాటలను

మనం ప్రమాణంగా తీసుకోకూడదు. నీకు శాంతి కావాలంటే, జ్ఞానం కావాలంటే ఈ లోకాన్ని తీసి ఒక ప్రక్కన పెట్టు.

మనం చనిపోయిన తరువాత ఈ సృష్టి ఆగిపోతుంది అని అనుకోవద్దు. ఈ సృష్టి కార్యక్రమం అలా జరిగిపోతూ ఉంటుంది, అది భగవంతుడు చూసుకొంటాడు. మనం ఏపనిమీద ఇక్కడకు వచ్చామో ఆపని పూర్తి చేసుకోవాలి అంటే ఈ ప్రకృతి గుణాలనుండి, వికారాలనుండి బయటకు రావాలి. మనం ఈ లోకంలోనికి అజ్ఞానంతో వచ్చినా మంచి పుస్తకాలు చదువుకొంటూ, సత్పురుషులతో సహవాసం చేస్తూ, పుణ్యక్షేత్రాలు దర్శించుకొంటూ, జపధ్యానాలు చేసుకొంటూ ఎంతోకొంత జ్ఞానాన్ని పెంచుకొని, సూక్ష్మశరీరాన్ని శుద్ధిచేసుకొని బయటకుపోవాలి, అది మన లక్ష్యం. భగవంతుడు అలా కాదు పరిపూర్ణమైన జ్ఞానంతో, పరిపూర్ణమైన శక్తితో ఈ భూమి మీదకు వస్తాడు, పరిపూర్ణమైన జ్ఞానంతో, శక్తితో బయటకు వెళ్ళిపోతాడు. అందుచేత ఆయనతో మనం పోల్చుకోకూడదు. మనం మంచి స్నేహాలు చేయాలి. ఆంజనేయస్వామితో స్నేహం చేసినవారు అందరూ బాగుపడ్డారు. సత్పురుషులతో స్నేహం వలన లౌకికంగాను, ఆధ్యాత్మికం గాను కూడా బాగుపడతాము. మీరు కాలక్షేపం మాటలకు వెళ్ళవద్దు, అలా వెడితే బ్రెయిన్‌లో కాలుష్యం వచ్చేస్తుంది. అక్కరలేని పనులలోనికి వెళితే అజ్ఞానం చుట్టుకొంటుంది. నీకు భగవంతుడు ఏ పని అయితే ఇచ్చాడో ఆపనిలో బద్ధకంగా ఉండవద్దు. బద్దకస్తులకు లోకానికి సంబంధించిన పనులు పూర్తి అవ్వవు, ఆత్మజ్ఞానం రాదు. మీరు ఏ పనిచేసినా దానివలన నా దయకు పాత్రులయ్యేలాగ చేయండి అని భగవంతుడు చెపుతున్నాడు. మన చర్మానికి దురదవస్తే పదిమంది డాక్టర్ల దగ్గరకు వెళతాము కాని మనస్సులో చెడుగుణాలు ఉంటే వాటిని తొలగించుకోవటానికి ఎక్కడికీ వెళ్లటం లేదు. ఈ సబ్జక్టు కనుక మీరు శ్రద్ధగా వింటూ ఉంటే, దానిని అర్థం చేసుకొంటే మీకు రాత్రి బాగా నిద్రపడుతుంది, మీరు బ్రతికున్నంత కాలం సుఖంగా బ్రతకగలరు, వివేకంగా ఉండగలరు, శరీరం మరణించాక మోక్షం పొందుతారు. మనం మాటల విషయంలో, ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఒక మహాత్ముడు ఏమి చెప్పాడు అంటే అవసరంలేని మాటలు మాట్లాడటం నోటికి వ్యభిచారం, హోటళ్ళకు వెళ్ళి కనిపించిన గడ్డిఅల్లా తినటం పొట్టకు వ్యభిచారం అని చెప్పాడు. మనం ఆధ్యాత్మికంగా, భౌతికంగా అభివృద్ధిలోనికి రావాలంటే ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి, చాలా రోగాలకు మన పొట్టే కేంద్రం. మనకు అక్కరలేని తలంపులతోటి, ఆలోచనల తోటి తాదాత్మ్యం చెందకూడదు. మన పని మనం జాగ్రత్తగా చేసుకొంటూ వెళ్ళిపోవాలి. ఇప్పుడు మనం చెప్పకొనే మాటలు ఇహానికి, పరానికి కూడా ఉపయోగపడతాయి.

నీవుకాని వస్తువులతోటి, మనుషులతోటి, సంఘటనలతోటి ఎలాగయితే తాదాత్మ్యం

పొందుతున్నావో అలాగ నీవు ఏదిగా ఉన్నావో దానితో నీవు తాదాత్మ్యం పొందినప్పడే నీకు సుఖం అంటే ఏమిటో తెలుస్తుంది, అది నిజమైన సుఖం, దానితో తాదాత్మ్యం పొందితేకాని పునర్జన్మలు ఆగవు. నువ్వుకాని శరీరంతోటి, నువ్వుకాని మనస్సుతోటి తాదాత్మ్యం పొందుతున్నంతకాలం సాధన పేరుచెప్పి అందులోనుండి విడుదలపొందాలి. నువ్వు పుణ్యం చేస్తే మంచిలోకాలకు, పాపంచేస్తే చెడ్డలోకాలకు వెళతావు, ఎక్కడకు వెళ్ళినా తిరిగి సంసార చక్రంలో పడతావు. నూటికి నూరుపాళ్ళు ఏ వస్తువులో అయితే సుఖం ఉందో దానితో నీవు తాదాత్మ్యం పొందేవరకూ జన్మలు ఆగవు. హృదయంలో ఉన్న సుఖం నీకు అందినప్పడు, శాంతిసముద్రంలో నీవు ఊగిసలాడుతున్నప్పడు దేహప్రారబ్దం అనుకూలంగా ఉంటే ఏమిటి? ప్రతికూలంగా ఉంటే ఏమిటి? కొంతమంది మేము ప్రారబ్దాన్ని అనుభవిస్తున్నాము అంటారు. చైతన్య ప్రవంతిలో నీవు ఊగిసలాడుతున్నప్పడు నేను ప్రారబ్దాన్ని అనుభవిస్తున్నాను అనే స్ఫురణ కూడా నీకు రాదు. ఇప్పడు మేము చెప్పే ఈ మాటల వలన మీరు దుఃఖస్పర్శలేనిస్థితికి ఎదిగిరావాలి. లేకపోతే ఈ మాటలు ఎందుకు? మీ అశాంతి అంతా శాంతిగా మారిపోవాలి, మీ దుఃఖం అంతా సుఖంగా మారిపోవాలి అందుకే ఈ ప్రవచనాలు, కాలక్షేపానికి కాదు. మీకు చదువు ఉన్నా లేకపోయినా, ఐశ్వర్యం ఉన్నా లేకపోయినా ఈ సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకొంటే మీ జీవితం సుఖంగా వెళ్ళిపోతుంది, మీ శరీరానికి మరణం వచ్చినా మీరు శాంతిగా, సుఖంగా శరీరంలో నుండి విడుదల పొందుతారు. కొంతమంది మనకు విరోధంగా ఉంటారు. నీ విరోధులు నిన్ను బాధలకు, కష్టాలకు గురిచేస్తారు అనుకో, నీ విరోధులు ఇన్ని రకాలుగా నిన్ను చెడగొడుతున్నప్పటికీ ఆ బాధలు, కష్టాలు, నష్టాలు నువ్వు సహించగలిగితే, భరించగలిగితే, నీవు ఓర్పుగా ఉండగలిగితే అట్టి సాధకుడు నా దయకు పాత్రుడవుతాడు అని భగవంతుడు చెపుతున్నాడు.

ప్రతీజ్ఞాని దయ కలిగి ఉంటాడు. అజ్ఞాని ఏమి చేస్తాడు అంటే తన అజ్ఞానాన్ని తీసుకొనివెళ్ళి జ్ఞానికి ఆరోపిస్తాడు. జ్ఞాని యొక్క దయ, ప్రేమ జ్ఞాని కానివాడికి ఎంత ప్రయత్నం చేసినా అది రాదు, జ్ఞానం వచ్చినప్పడే ఆవైభవం ఉంటుంది. జ్ఞాని ఆనందసముద్రంలో ఈదులాడుతూ ఉంటాడు. వాడు పంచిపెట్టాలని దయను పంచిపెట్టడు, అది పొంగిపొరలి ప్రవహిస్తూ ఉంటుంది. మనం పాడైపోవటానికి కారణం ఏమిటి అంటే మనం భగవంతుడు చెప్పిన మాటలు వినము, గురువు చెప్పిన మాటలు వినము. మన అజ్ఞానం చెప్పినట్లు వింటాము, ఇలా ఉంటే మనం పాడుజన్మలలోనికి, చీకటిలోకాలలోనికి వెళతాము. నీకు భగవంతుడు మీద విశ్వాసం ఉన్నా లేకపోయినా, ఈ శరీరం మరణించాక మీ సూక్ష్మశరీరం మీ కూడా వస్తుంది, ఇది గుర్తు పెట్టుకోండి. ఆ సూక్ష్మశరీరాన్ని బాగుచేసుకొనే ప్రయత్నం మనం చెయ్యటం లేదు, ఆ తపన మనకు లేదు. పూర్వజన్మలో ఎంతో కష్టపడి పుణ్యకర్మలు

చేసి ఈ దేహం సంపాదించుకొన్నారు. మీరు లక్షలు సంపాదించి ఆ రూపాయి కాగితాలు పొయ్యిలో పెట్టి నీళ్ళు కాచుకుంటే ఎలాగఉంటుందో అలాగే పుణ్యకర్మలు చేసి సంపాదించు కున్న ఈదేహాన్ని అవసరంలేని పనులకు, అవసరంలేని విషయాలకు ఉపయోగించుకోవటం అలాగే ఉంటుంది. మీరు నీళ్ళు కాచుకోవటానికి డబ్బు సంపాదించుకుంటున్నారా? మీరు కాలాన్ని దుర్వినియోగం చేసుకోవటానికి పూర్వజన్మలో సత్కర్మలు చేసి ఈ శరీరాన్ని సంపాదించుకొన్నారా? జాగ్రత్తగా ఆలోచించుకోండి. మీరు మంచి చెప్పినా ఇతరులు వినరు అనుకోండి? వారి పని వారిని చేసుకోనివ్వండి. మీ పని మీరు మానవద్దు అంటున్నాడు పరమాత్మ. వారి పని వారు మాననప్పుడు మీ పని మీరు మానటం ఎందుకు? జ్ఞాని మంచివారి పట్ల ఆప్యాయంగా ఉంటాడు. జ్ఞాని ఎవరికీ సహాయం చేయాలని చేయడు, జ్ఞానిద్వారా సహాయ సహకారములు అందుతూ ఉంటాయి. జ్ఞానికి సంకల్పాలు ఏమీవుండవు.

మీరు గతం అంతా మర్చిపోండి, జరగబోయే గొడవలు ఏమీ ఊహించుకోవద్దు, వర్తమానకాలాన్ని సవినయంగా ఉపయోగించుకోండి. మీ శక్తిని దుర్వినియోగం చేసుకోవద్దు, మీ కాలాన్ని పాడుచేసుకోవద్దు. మనం పొయ్యి వెలిగించాము అనుకోండి, పొగ ఎక్కువగా ఉంటే గోడలు మసి అవ్వవచ్చు, పరిసరాలు అన్నీ మసి అవ్వవచ్చు అంతేగాని ఈ భూమి మీద ఉన్న పొగ వలన ఆకాశం మసి అవ్వదు. నీ దేహం మంచి పనులు చేయకపోయినా, నీ మనస్సుకు చెడు ఆలోచన వచ్చినా నీ హృదయంలో ఉన్న సత్యం అప్పుడు ఎలాగ ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది. నీ దేహంతో చేసే పనులవలన, నీ మనస్సుకు వచ్చే ఆలోచనల వలన, నీలో ఉన్న అజ్ఞానం వలన నీలోపల ఉన్న అంతర్యామి, నీలోపల ఉన్న పరమాత్మ మసికాడువయ్యా. ఎందుకు గతాన్ని తవ్వుకొంటావు, భవిష్యత్ గురించి గాలిమేడలు కడతావు. నువ్వు మంచివాడవు అనుకొన్నా, చెడ్డవాడవు అనుకొన్నా లోపల ఉన్న వస్తువు ఎలాగ ఉందో అలాగే ఉంది. ఏనుగుకు పెద్ద దేహం ఉంది, చీమకు చిన్న దేహం ఉంది. కాని ఈ రెండింటిలో అంతర్యామి సమానంగానే ఉన్నాడు. అక్కడ పెద్దదిగా లేడు, ఇక్కడ చిన్నదిగా లేడు. మనో దేహములతో సంబంధం లేకుండా, లోకంతో సంబంధం లేకుండా, బుద్ధి యొక్క, ఇంద్రియాల యొక్క కాలుష్యంతో సంబంధం లేకుండా లోపల నారాయణుడు అంతర్యామిగా ఉన్నాడు. నువ్వు వాడి దయను సంపాదించు. ఈ సృష్టికి ఆధారంగా ఉన్నది ఆయనే. ఆధారంగా ఉన్నది నిజమే, ఆధారం మీద కల్పించినది అబద్ధం. మీ నామ రూపములతో తాదాత్మ్యం మీకు లేకపోతే, దేహము నేను అనే తలంపుతో తాదాత్మ్యం వదులుకొంటే ఎప్పుడో కాదు, ఎక్కడో కాదు. ఇప్పడే ఇక్కడే నీ హృదయంలో ఉన్న సుఖసముద్రం పొంగి నీ సహస్రారాన్ని ముంచుతుంది, అంతర్యామికి సంబంధించిన ఆనందం మీ చేతికి అందుతోంది అనుకోండి అప్పుడు మీ దేహానికి చావు వచ్చినా మీకు

ఏమీ అనిపించదు, ఆ స్థితికి మీరు ఎదిగి రావాలి, అందుకే ఈ ప్రవచనాలు. శిష్టా సుబ్బారావుగారు భగవాన్‌తో చూపు తగ్గిపోతోంది అని అంటే మీరు బయట చూపుకు ప్రాముఖ్యత ఇవ్వవద్దు, లోపలచూపు నేర్చుకోండి, లోపలచూపు అలవాటు పడితే, లోపల ఉన్న వస్తువు మీకు దొరికితే బయట చూపు లేదు అనే తలంపు కూడా పోతుంది అన్నారు భగవాన్, అది జ్ఞానం యొక్క వైభవం. సత్పురుషులను, మహర్షులను, మహాత్ములను ఆరాధించటం వలన భౌతిక సంపదలే కాదు, మోక్షం కూడా వస్తుంది. జ్ఞానికి పెట్టే నమస్కారం నాకే వర్తిస్తుంది అని పరమాత్మ చెప్పాడు. దేహబుద్ధి లేనివాడికి నీవు ఏ గౌరవం చేసినా అది వెళ్లి ఈశ్వరుని మెడలో హారంలా పడుతుంది. జ్ఞాని అన్ని పరిస్థితులలో అన్ని అవస్థలలో ఒకేలాగ ఉంటాడు. మీరు ఏదైనా మంచి చేసినా, చెడు చేసినా ఒక కాలంలో చేస్తారు, ఇంకో కాలంలో అనుభవిస్తారు, అది పోతుంది. ఆత్మజ్ఞానం కర్మఫలితం వలన రాదు అని పరమాత్మ చెపుతున్నాడు. పదిమందికి ఉపకారం చేసావు అనుకో మంచిదే పుణ్యం వస్తుంది, ఆత్మజ్ఞానం రాదు. ఆత్మను ధ్యానంచేసి, ఆత్మను స్మరించి, నువ్వు ఆత్మకోసం జీవిస్తూ ఉంటే, దాని కోసమే నీ కాలాన్ని అంతా వెచ్చిస్తూ ఉంటే, అప్పుడు ఆత్మ కూడా వీడు నా కోసమే బతుకుతున్నాడు అనుకొంటే, అప్పుడు ఆత్మ యొక్క దయ వలన నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

కొంతమందికి అధికారం వస్తే అతిగా ప్రవర్తిస్తారు, కోతికి కొబ్బరికాయ దొరికినట్లుగా ఉంటుంది, సాధ్యమైనంత వరకు తక్కువ కలుగజేసుకొనేవాడే మంచి పరిపాలకుడు. అవసరం లేనిదానికి కూడా కొంతమంది కలబడిపోతారు. జ్ఞాని ఏది చేసినా ఇతరులకోసమే చేస్తాడు. ఒకవేళ జ్ఞాని ఆగ్రహించినా, అది కూడా ఇతరులకోసమే, అది గుర్తించిన వాడు ధన్యుడు. కొంతమంది ఎలా ఉంటారు అంటే వారితో మాట్లాడితే నాకు ఏమి కలిసివస్తుంది, నీకు ఆ పని చేస్తే నాకు ఏమి కలిసివస్తుంది అని ఆలోచిస్తూ ఉంటారు, ఇలా అహంకారం కేంద్రంగా పెట్టుకొని పనిచేసేవారు, వారికి బాహ్యంగా వేయి కోట్ల డబ్బు ఉన్నా వారు కూలివారితో సమానము అని పరమాత్మ చెప్పాడు. మన సొంతపని ఎలాగ చేసుకొంటామో ఇతరుల పని అలాగ చేయము, చిత్తశుద్ధి లేని పనులు చేస్తున్నాము. మన సొంత ఇల్లు ఎలాగ కట్టుకొంటామో అలాగ కాటన్ దొర ఆనకట్ట కట్టాడు, అందుకే ఇప్పటికీ ఆయనను స్మరించుకొంటున్నాము. మేము చెప్పే ఈ మాటలు మీకు ఉన్న వివేకాన్ని పెంచటానికి ఉపయోగపడాలి లేకపోతే ఈ మాటలు ఎందుకు? కొంతమంది అన్నీ మాకే తెలుసు అంటారు, అన్నీ మీకే తెలిస్తే ఇంక మీకు భగవంతుడు ఎందుకు? చనిపోయేవాడికి కూడా అదే చివరిశ్వాస అని వాడికి తెలియదు, ఇంకా ఉంటాను అనుకొంటాడు. ఆ చివరిశ్వాసే మీకు తెలియదు కాని అన్నీ తెలుసును అంటారు. జ్ఞాని అందరినీ చూస్తూ ఉంటాడు, అన్ని వికారాలను, అన్ని గుణాలను చూస్తూ తాను ఆ వికారములకు లోనుకాకుండా, సమత్వాన్ని

విడిచిపెట్టకుండా తనలోపల ఉన్న వస్తువునే అక్కడ చూస్తూఉంటాడు, వాడు జ్ఞాని, వాడు గురువు. జ్ఞాని నిన్ను చూసినప్పుడు కూడా తనని తానే చూసుకొంటాడు. నీలో చాలా వికారాలు ఉండవచ్చు, ఆ వికారాలను చూడడు, ఆ వికారములలో నుండి నిన్ను విడుదల చేయటానికి చూస్తాడు, నీకు సహాయ సహకారములు అందిస్తాడు, వాడు గురువు. ఇది అంతా కూడా సైలెంట్‌గా చేస్తాడు. పారమార్థిక సత్యంతో ఏకమైన వాడే జ్ఞాని. మీలో ఉన్న బలహీనతలు శాశ్వతంకాదు, అవి నిజం కాదు కాబట్టి సాధన చేస్తే అవి పోతాయి, ఈశ్వరుని దయను సంపాదిస్తే ఇవి అన్నీ పోతాయి. మీలో ఉన్న మంచితనం, వివేకం, బుద్ధిసూక్ష్మత పెంచుకొంటూ ఉంటే, భగవంతుని మీద ధ్యాసపెట్టుకొని పనిచేస్తూ ఉంటే మీకు పూర్వజన్మలలో ఎంత చెడు ఉన్నా అంటే మీకు చెడుప్రారబ్ధం ఉన్నా దానికి ఎంత శక్తి ఉందో అంతశక్తి చూపించకుండా బయటకు పోతుంది, అంటే తలకాయ పోయేది కిరీటం పోయి ఆగిపోతుంది, అది మంచితనం యొక్క వైభవం.

గంటల తరబడి గది తలుపులు వేసుకొని ధ్యానం చేసేవాడికి ఏ ఫలితం వస్తుందో సహృదయంతో సత్కర్మ చేసేవాడికి అదే ఫలితం వస్తుంది అంటున్నాడు పరమాత్మ. మీరు ఒక మంచి పనిచేసి దాని వలన వచ్చే ఫలితం సమాజానికి ఇవ్వండి, అందులో ఉన్న కష్టం ఏమిటో మీకు తెలుస్తుంది, కర్మఫలాన్ని త్యాగం చేయటం ఎంత కష్టమో అప్పుడు మీకు తెలుస్తుంది. మీరు సబ్జక్టును అర్థం చేసుకోవటం మానివేసి ఆవేశపడుతున్నారు, ఉద్రేకం నేర్చుకొంటున్నారు. మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు పొంగు రాకుండా, పరిస్థితులు ప్రతికూలంగా ఉంటే కుంగు రాకుండా చూసుకొంటూ ఉంటే మీకు తెలియకుండానే నెమ్మదిగా అహంభావన నశిస్తుంది, ఎందుచేతనంటే అప్పుడు అహంభావనకు వెళ్ళే ఆహారం తగ్గిపోతుంది, దానికి వెళ్ళే మేత ఎప్పుడైతే తగ్గిపోయిందో అది నెమ్మదిగా సన్నగిల్లి నశిస్తుంది. ఇతరుల గొడవలలోనికి వెళ్ళటం తగ్గించుకోవాలి, వైరాగ్యాన్ని పెంచుకోవాలి, సత్వగుణాన్ని పెంచుకోవాలి. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను సమాజానికి ఉపయోగించాలి, అక్కడ మీరు ఏమీ ఆశించకూడదు. పని మిమ్మల్ని బంధించదు, ఆసక్తి మిమ్మల్ని బంధిస్తుంది. కర్మఫల త్యాగికి అంతఃకరణశుద్ధి కలుగుతుంది. ఈ లోకంతోటి, దేహంతోటి, కర్మసిద్ధాంతం తోటి దేనితోను సంబంధం లేకుండా నూటికి నూరుపాళ్ళు మీరు ఆనందంగా ఉన్నారనుకోండి ఇంక పునర్జన్మ రాదు, అదే కడసారి జన్మ, మీరు అలా ఉన్నారో లేదో చూసుకోండి. అనుకొనేది జీవసంకల్పం, జరిగేది దైవసంకల్పం. దైవసంకల్పానికి భిన్నంగా జ్ఞాని ఉండడు, అందుచేత అక్కడ ఘర్షణ లేదు. మనకు పరమాత్మ పాదాల పట్ల భక్తి కుదిరింది అనుకోండి మన శరీరానికి శ్రమ లేకుండా, సాధనతో పనిలేకుండా మనస్సు అణిగిపోతుంది. ఈశ్వరసంకల్పం పట్ల మనకు గౌరవం కుదిరితే, ఆసక్తి లేకుండా మనం పని చేస్తూఉంటే, భగవంతుడికి నీ

మీద దయ, ప్రేమ కలిగితే దూడ పుట్టిన వెంటనే ఆవు ఆ దూడమీద ఉన్న మాయను ఎలా నాకుతుందో అలాగ నీ అంతఃకరణంలో ఉన్న దోషాలను అన్నీ భగవంతుడు నాకి, నిన్ను పవిత్రుడిని చేసి, ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. నీకు ఉన్న డబ్బుతో, పాండిత్యంతో భగవంతుడిని కొనలేవు. మనం ఏవైతే గొప్పవి అనుకొంటున్నామో అవి భగవంతుడి దృష్టిలో డస్టు. ఎవరికైతే భక్తి కలిగిందో, ఎవరికైతే జ్ఞానం కలిగిందో వారికి పరమాత్మ స్వాధీనమవుతాడు. భగవంతుడు అంతటా ఉన్నాడు కాని మన పాడుబుద్ధికి గోచరించటం లేదు కాబట్టి ఆయన లేడు అనుకొంటున్నాము. నువ్వు ఐశ్వర్యం సంపాదించుకో, పాండిత్యం సంపాదించుకో మంచిదే అలాగని బుద్ధిని పాడుచేసుకొని ఈ లోకంలో నుండి బయటకు వెళ్ళకు. కాలప్రవాహంలో నీవు సంపాదించిన డబ్బు, పాండిత్యం అన్నీ పోతాయి. నువ్వు నేర్చుకొన్నవి అన్నీ ఇక్కడ విడిచిపెట్టవలసిందే. ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాల గురించి మీ బుద్ధిని పాడుచేసుకొంటారా? మీ బుద్ధి పాడైపోయిన తరువాత మీ చదువు, డబ్బు, అధికారం ఏమి చేసుకొంటారు. జ్ఞాని శరీరం ఈశ్వరుడి స్వాధీనంలో ఉంటుంది, మన శరీరం అహంకారం స్వాధీనంలో ఉంటుంది. జ్ఞాని శరీరం ద్వారా ఏది జరిగినా అకర్తగా ఉంటాడు. మనం దేహం అనుకోవటం వలన ఏ పని చేసినా మనమే సాధించాము అనుకొంటాము. దేహబుద్ధి వలన మనకు కర్తృత్వం వస్తోంది. మన డ్యూటీ మనం చేయాలి కాని కర్తృత్వం పెట్టుకోకూడదు, ఆసక్తి పెట్టుకోకూడదు. అలా ఉంటే మనం శాంతిగా ఉంటాము, ఆ పని పూర్తి అయిపోతుంది, కర్తలేని కర్మ అంటే అది.

మీరు ఈశ్వరుడి పట్ల భక్తిని విడిచిపెట్టవద్దు. భక్తి లేకుండా వివేకం, విచక్షణ, జ్ఞానం రాదు. అది అలా జరిగి పోయింది, ఇది ఇలా జరిగిపోయింది అనుకొంటున్నారు, ఇంకా ఏవో జరుగుతాయి అని ఊహించుకొంటున్నారు జరిగిపోయినది ఏమీ లేదు, ఇప్పుడు జరుగుతున్నది లేదు, భవిష్యత్తులో ఏమీ జరిగేది లేదు. ఇవన్నీ ఊహించుకొని మీ బుద్ధిని పాడుచేసుకొంటున్నారు, ఇది అంతా స్వప్నమే. నథింగ్ ఎవ్వర్ హేపెన్. మీరు మీరుగా ఉండటం నేర్చుకోండి. ఎవరు పేదవారు అని ఈమధ్య ఒకరు నన్ను అడిగారు. నేను ఊరక ఉన్నాను. ఆయన ఏమి చెప్పారు అంటే ఎవరు శారీరకంగా ఎక్కువ కష్టపడుతున్నారో వారే పేదవారు అని మనం గుర్తించాలి అని చెప్పారు. డబ్బు అంటే మాయ, అది ఎలా వచ్చిందో అలాగే పోతుంది. మనలను ఇతరులు ఎవరైనా మోసగిస్తున్నారు అనుకోండి వారు తప్పు చేస్తున్నారు అనుకొంటాము కాని వాళ్ళది ఎంత తప్పో మనది కూడా అంతే తప్పు. ఎందుచేతనంటే ఇతరులు మోసం చేస్తూ ఉంటే మోసగింపబడకుండా ఉండే తెలివి మనకు లేదు, ఇక్కడ మన తప్పు మనకు తెలియటం లేదు, వారిని తిడుతున్నాము, ఇది గుర్తించాలి. మనకు సహనం లేదు, వివేకం లేదు, విచక్షణ లేదు. ప్రపంచంలో అనేక ఆకర్షణలు

ఉన్నాయి. మన తెలివితేటల వలన వాటిని జయించలేము. భగవంతుడి యందు భక్తి కలిగి, ఆయనను స్మరిస్తూ, ఆయనను ధ్యానిస్తూ, ఆయన పాదాలను ఆశ్రయిస్తే వాటిలోనుండి బయటపడతాము. సుగుణాలను పెంచుకొంటూ గుణాతీతస్థితిని పొందు, కర్మను చేస్తూ చేస్తూ కర్మను దాటి వెళ్ళిపో అంటున్నాడు పరమాత్మ. మనం బల్లకట్టు మీద కూర్చొని ఉండిపోము. బల్లకట్టు ఉపయోగించుకొని ఈ ఒడ్డు నుండి ఆ ఒడ్డుకు దాటి వెళతాము. అలాగే కర్మను సాధనంగా చేసుకొని చీకటిలో నుండి వెలుతురు లోనికి, అజ్ఞానంలో నుండి జ్ఞానం లోనికి రావటానికి ప్రయత్నం చెయ్యి.

గోపికలకు పాండిత్యం లేదు, శ్రీకృష్ణచైతన్య గొప్ప పండితుడు, సన్యాసి ఆయన చివరి రోజులలో ఒక మాట చెప్పారు. పాండిత్యం, ఆస్తులు లేని గోపికలకు కృష్ణుడి మీద ఉన్న భక్తి, ప్రేమ కూడా నాకు పరమాత్మ మీద రాలేదు అని చెప్పాడు. కృష్ణా అంటే చైతన్యుడికి సమాధి వచ్చేది అయినా గోపికల ప్రేమతోటి ఈ ప్రేమ సరిపోతుందా అన్నాడు. గాలి లేకుండా బ్రతకగలరు కాని పరమాత్మ మీద ప్రేమ లేకుండా బ్రతకలేనిస్థితి గోపికలది. గోపికల మనస్సులో ఉన్న ఏకాగ్రత, పవిత్రత, కృష్ణుడిని అతిగా ప్రేమిస్తున్నాము వారి కుటుంబసభ్యులు ఏమైనా అనుకొంటారేమో అనికూడా తెలియని ధ్యాస, వారి ప్రాణం కృష్ణా, వారి మనస్సు కృష్ణా, వారి లోకం కృష్ణా, వారికి అంతా కృష్ణుడే. గౌరవాలు, అగౌరవాలు లెక్కింపు లేనటువంటి ప్రేమ. ఒక్క గోపికకు ఉన్న ప్రేమ, భక్తి నాకుఉంటే చాలు నేను తరించిపోతాను, గోపికల యొక్క పాదధూళి మన శరీరం మీద పడినాచాలు మనం తరించిపోతాము అన్నాడు చైతన్యుడు. గోపికల ప్రేమ, భక్తి అలౌకికమైనది, అభౌతికమైనది. గోపికల ప్రేమ ఇట్టిది అని పోల్చటానికి ఇంకొకటి లేదు, అది సహజమైన ప్రేమ. అజ్ఞానంలోనుండి, దేహాభిమానంలోనుండి ఇసుమంతయు నొప్పిలేకుండా బయటకు రావాలంటే ఆగోపికలకు ఉన్న ప్రేమ నేర్చుకొంటే చాలా తేలికగా శరీరానికి శ్రమ లేకుండా బయటకు వచ్చేస్తాము, ఎంతో కష్టపడిపోతున్నాము అనే వేదన మనకు ఉండదు. మీరు సాధన చేసేటప్పుడు మీకు అవసరంలేని తలంపులు వస్తాయి, ఈ తలంపులు ఎవరికి వస్తున్నాయి అని ప్రశ్నించుకోండి? ఇవి అన్నీ మిథ్యానేనుకే వస్తున్నాయి అని తెలుసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే లోపల ఉన్న బురద అంతా బయటకు వస్తూ ఉంటుంది. మీ పూర్వజన్మలో తెలియక పొరపాట్లు చేసారు, ఇప్పుడు తెలిసి వాటిని పోగొట్టుకోండి. పూర్వజన్మలో వాసనలు ఊరికేరావు కూడా బురద తీసుకొని వస్తాయి, ఆ బురదతో తాదాత్మ్యం పొందకండి. ఏమిటి ఈ వాసనలు ఇలా వస్తున్నాయి, ఇన్ని వాసనలు ఉంటే మనకు మోక్షం వస్తుందా అని కంగారుపడకండి. ఆ వాసనలతో మీరు కలవవద్దు, ఆ బురద దానంతట అదే పోతుంది, మీరు కంగారుపడితే ఉన్న బురద పెరిగిపోతుంది. మీకు వచ్చే తలంపులను వేరుగా చూడండి ఆ బురద అంతా

కొట్టుకొనిపోతుంది అంటున్నారు భగవాన్. గోపికలు ఏమంటున్నారు అంటే మేము పరమాత్మ వంకే చూస్తూ ఉంటాము, అసలు ఆ బురద వంక చూడము అంటున్నారు. మేము పరమాత్మ గురించి మాట్లాడుకొంటాము, ఆయన లీలలు చెప్పకొంటాము, ఈ లోపు ఆ బురద ఎలా వచ్చిందో అలాగే పోతుంది. మనం నిద్రలో ఉండగా మన శరీరం మీద నుండి పాము పాకి వెళ్ళిపోయింది అనుకోండి, అసలు ఆ పాము పాకి వెళ్ళినట్లు మనకు తెలియదు. అలాగే మాకు పరమాత్మ ధ్యాస తప్ప ఇంకేమీ లేదు బురద వస్తే వస్తుంది కాని అది వచ్చివెళ్ళిన ధ్యాస, ఆ ధోరణి మాకు లేదు అంటున్నారు గోపికలు. ప్రారబ్దాన్ని బట్టి మీకు మంచిరోజులు రావచ్చు, చెడురోజులు రావచ్చు అందులో మీరు కలిసిపోవద్దు, అది వచ్చి వెళ్ళిపోతుంది. మీ సాధనలో మీరు ఉండండి, మీ గమ్యాన్ని మర్చిపోవద్దు, పరమాత్మ పాదాలను విడిచిపెట్టవద్దు. కొంతమంది చిన్న కష్టం వచ్చినా దానిని పెద్దది చేసేసుకొంటారు అది పనికిరాదు అని పరమాత్మ చెపుతున్నాడు.

మనకు మంచిప్రారబ్దం వచ్చినా అందులో కలిసిపోయి మీరు అజ్ఞానం పెంచుకొంటూ ఉంటే ఆ మంచిప్రారబ్దం కూడా భవిష్యత్‌లో బురద తీసుకొని వస్తుంది. చెడు ప్రారబ్దం వచ్చినా కలవకండి. అలా కలవకుండా ఉంటే మీకు బురద అంటుకోదు. సాధన అంటే ఏమీ లేదు ఈ బురద గొడవ వదిలించుకోవాలి. చెరువులో నీళ్ళు ఉన్నాయి అనుకోండి, ఆ నీటి అడుగునకు వెళ్ళి అస్తమాను అటూ ఇటూ కదుపుతున్నారు అనుకోండి, బురద అంతా పైకి వచ్చేస్తుంది, మీరు కెలకటం మానివేస్తారు అనుకోండి, బురద కిందకు వెళ్ళిపోతుంది. అలాగే మీకు ఏమైనా గొడవలు వచ్చాయి అనుకోండి, అస్తమాను వాటిని కెలుక్కోవద్దు, కెలుక్కోకుండా ఉంటే అవి పోతాయి, మీ అంతట మీరు అస్తమాను వాటిని కెలుక్కొంటూ ఉంటే చిన్న గొడవలు కూడా పెద్దవి అవుతాయి. కొంతమందికి అసలు భగవంతుడి స్మరణ ఉండదు, ఎంతసేపు వారు కొట్టారని, వీరు తిట్టారని ఇటువంటి మాటలు చెప్పకొంటూ కాలం గడిపేస్తారు, ఈ లోపు శరీరానికి మరణం వచ్చేస్తుంది. మనం ఈ భూమి మీదకు వచ్చినందుకు మనం మోక్షం పొందాలి, మన గమ్యం అదే, ఇది జ్ఞాపకం పెట్టుకోండి. గోపకల భక్తి ఎటువంటిది అంటే వారు పాలు తాగేటప్పడు కూడా పరమాత్మ స్మరణే ఆ గోపికల పెదాలకు తగిలేది, అట్టిది వారి ప్రేమ, అట్టిది వారి భక్తి. ఇంక బురద ఎక్కడ ఉంది? బురద వస్తుంది, ఆ బురదతో మీరు తాదాత్మ్యం పొందకండి, అది ఎలా వచ్చిందో అలాగే పోతుంది అని విచారణమార్గంలో చెప్పవచ్చు కాని గోపికలు ఏమంటున్నారు అంటే తాదాత్మ్యం మాట అలా ఉంచండి పరమాత్మ స్మరణలో అది వచ్చి వెళ్ళిపోయిన జాడ కూడా మాకు తెలియటం లేదు, ఆ గుర్తింపు మాకు లేదు అంటున్నారు. అట్టిది గోపికల యొక్క ప్రేమ. ఇంట్లోనివారు ఏమనుకొంటారనే తలంపు కూడా గోపికలకు లేదు. మనం ఏదైనా కొంత లేటు అయితే ఏదో అబద్ధం చెప్పటానికి ముందునుండే ప్రిపేర్ అవుతాము కాని గోపికలకు అసలు ఆ ధ్యాసే లేదు. గోపికల ప్రేమ నేర్చుకొన్నదికాదు, అది

ఆపుకోలేని ప్రేమ. ఆ ప్రేమ ప్రవాహంలో, భక్తి ప్రవాహంలో ఒకవేళ బురద ఉన్నా ఆ ప్రవాహంలో కొట్టుకొని పోతుంది, అప్పుడు కూడా మాకు కనిపించేది నీ పాదాలే అంటున్నారు గోపికలు, అట్టిది వారి ప్రేమ. మన పని మనం శ్రద్ధగా చేసుకోవాలి. మన పని మనం శ్రద్ధగా చేయము అనుకోండి, ఆ చేయలేనితనం మనకు తిరిగి దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. కంగారు పడవద్దు, అక్కడ అలా జరిగింది, ఇక్కడ ఇలా జరిగిపోయింది, ఏదో జరిగిపోతోంది అని అన్నీ నొల్లుకొని, ఏవో కల్పించుకొని మీరు దుఃఖంలో పడిపోతున్నారు. పూర్వజన్మలో ఏమీ జరగలేదు, ఇప్పుడు ఏమీ జరగటం లేదు, రాబోయే జన్మలో ఏదీ జరగదు. మీకు తెలియకపోవటం వలన, మీ అజ్ఞానం వలన మీకు అలా అనిపిస్తోంది. ఏదో జరిగిపోయింది అనుకోవటం వలన దుఃఖం వస్తోంది, ఏదైనా జరిగితే కదా దుఃఖం రావటానికి. నథింగ్ ఎవర్ హేపెన్, బి హేపీ.

జనన మరణములు లేనివాడు, బంధం లేనివాడు, శాంతి కలవాడు, స్వతంత్రుడు పరమాత్మ, మనం పరమాత్మ పాదాలను ఆశ్రయిస్తే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, అదే మోక్షం, అదే సుఖం. భగవంతుడు ఈ లోకంలోనికి వచ్చేటప్పుడు అతివైభవంగా వస్తాడు, వెళ్ళేటప్పుడు అతి వైభవంగా వెళ్ళిపోతాడు. మనం ఏడుస్తూ వస్తాము, అజ్ఞానంతో వస్తాము, కాని వెళ్ళేటప్పుడు అజ్ఞానం తొలగించుకొని ఆనందంతో, శాంతితో వెళ్ళిపోవాలి. వందమాటలు అక్కరలేదు, పరమాత్మ యొక్క ఒక్క చూపు చాలు, ఒక్కమాట చాలు, ఆయన మౌనం చాలు, మనలో ఉన్న అజ్ఞానం అంతా కాలి బూడిద అవుతుంది. మనం భగవంతుడిని స్మరించుకొంటాము కాని ఒక్కసారి భగవంతుడు మన గురించి అనుకొంటే చాలు మన పని పూర్తి అయిపోతుంది. జటాయువుకు రాముడు తన చేతులతో శవ సంస్కారం చేసాడు. పెద్ద పెద్ద తపస్సులు చేసినవారు, మహర్షులు ఎటువంటి పుణ్యలోకాలకు వెడుతున్నారో అక్కడకు వెళ్ళు జటాయువు అన్నాడు, వెళ్ళవలసిందే, అది రాముడి వాక్యం. మీరు కంగారుపడకండి అదృష్టం బురదే, దురదృష్టం బురదే, ఎందుచేత బురద అంటే అదృష్టం మీరుకాదు, దురదృష్టం మీరు కాదు, అదృష్టం వచ్చినప్పుడు రోజులు బాగా వెళ్ళిపోతాయి, దురదృష్టం వచ్చినప్పుడు రోజులు ఇబ్బందికరంగా వెళ్ళిపోతాయి. అదీ బురదే, ఇదీ బురదే, అలా వస్తుంది, వెళ్ళిపోతుంది, దానితో తాదాత్మ్యం పొందకండి. దానితో తాదాత్మ్యం పొందితే బురద పెరిగిపోతుంది. ఒక్కమాట మీరు గుర్తు పెట్టుకోండి మనం ఆనందంలో ఉన్నాము అనుకోండి ఈ దేహం చనిపోయినా, లోకం కనిపించకపోయినా మనకు ఏమీ అనిపించదు, అట్టి ఆనంద స్థితికి మనం ఎదిగిరావాలి, ఈ ప్రవచనాల లక్ష్యం అదే. మనం తరించటానికి పెద్ద పెద్ద సాధనలు అక్కరలేదు. పరమాత్మ పాదాలయందు భక్తి ఉంటే చాలు మనం తరిస్తాము. దేవుడు దేవుడిగా వస్తున్నాడు, దేవుడిగా వెళ్ళిపోతున్నాడు, ఆయన వైభవం అది. మనం జీవులుగా వచ్చాము కాని వెళ్ళేటప్పుడు దేవుడు అయ్యి వెళదాము, ఈరోజు ప్రవచనం యొక్క సందేశం అది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 08-10-05 | శని | చిలుకూరు, వయా మహదేవ పట్నం |
| 16-10-05 | ఆది | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |
| 27-10-05 | గురు | క్షత్రియ కళ్యాణ మండపం, పాలకొల్లు |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# మోహం నశిస్తేనే మోక్ష బుద్ధి కలుగుతుంది

లోకంలో ప్రభలంగా ఉన్న రంగులు - రూపాలు మొదలుగాగల తమాషాల మూలంగా మనస్సు ఏకాగ్రతను కోల్పోతున్నది. మనస్సు ప్రకృతిలోకి వచ్చిందంటే అంతా కపటంతోనే చేస్తుంది. ప్రతి ఒక్కటీ కావాలని మానవుడు ఆశిస్తాడు వాటిని పొందటానికి పాపాలు చేస్తూ ఉంటాడు. సాధారణంగా సంపద మొదలైనవి అన్నీ పాపాలు లేకుండా సమకూరవు అలా సమకూరినవన్నీ చనిపోయేటప్పడు వెంటరావు. అలెగ్జాండర్ ప్రపంచాన్ని జయించి వట్టి చేతులతోనే వెళు తున్నానని తెలిపాడు. మోహం వల్ల ఉద్భవించునది అంతా దుఃఖమే. మోహ భావన ఎంత ఎక్కువగా నశిస్తే అంత ఎక్కువగా మనలో మహత్తర శక్తి ప్రజ్వలిత మౌతుంది. కాబట్టి ఇంద్రియాలను, బుద్ధిని బహిర్ముఖం కాకుండా అంతర్ముఖం చెయ్యటం ఒక్కటే సరైన మార్గము "మోహమనే సముద్రాన్ని దాటకుండా రాగ-ద్వేషాలనే రాక్షసులను సహకరించకుండా సత్యంలో ఎలా నిలవగలవు" అన్నారు శంకరులు. వర్షాకాలంలో మేఘాల కదలిక ఉధృతంగా ఉన్నంతకాలం - ఆకాశం నుంచి వర్ష బిందువులు పడుతూనే ఉంటాయి. అలాగే మనస్సులో మోహం ఉ ంటుందో అక్కడ సంకల్పాలు, ఆశలు, సుఖదుఃఖాలు చేరి ఉంటాయి. అరికాలు నుంచి శిరస్సు వరకూ శరీరంలో అణువణువునా పరిశీలించి చూచినా ఆమోదయోగ్యమైన ఏదీ లేదు. రాతి విగ్రహాలకు పరస్పరం ప్రేమలు ఉండవు. అలాగే జఢమైన దేహాదుల యందు ప్రేమ ఎందుకు కలుగుతోందో ఒక్క క్షణం ఆగి పరిశీలిస్తే మోహబుద్ధి కలుగుతుందా? సముద్రంలో కెరటాలు కలుస్తాయి, విడిపోతాయి. అంతా నీరే అలాగే సంతానం మనే మాయారూపాలమీద అంతరంగంలో అంతా చైతన్యమే అనే భావన స్థిరపడితే మోహం ఎక్కడ శ్రీనాన్నగారు అన్నారు. కుటుంబ రాగ బంధనాలలో చిక్కుకొని దుఃఖం కలిగితే నిప్పులు చల్లారినట్లు మోహం వల్ల జనించే దుఃఖం వెంటనే నశిస్తుంది" అన్నారు. జ్ఞాని దృష్టి తనకన్న భిన్నంగా దేన్ని చూడడు ఆ భావనలోనే మనం ఉంటే మనకు మోహం ఉదయించదు. శాశ్వత సుఖాన్ని పొందుతారు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**



సద్గురు శ్రీ నాన్నగారుతో శ్రీరమణ క్షేత్ర కమిటీ సభ్యులు



సద్గురు శ్రీనాన్నగారి జన్మదినోత్సవ సందర్భంగా పూజ చేస్తున్న రిటైర్డ్ ఇఇ శ్రీ దాట్ల కృష్ణమూర్తిరాజు దంపతులు